www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -213 శుక్రవారం 20 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ ఉండదు

సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సీమ లిప్ట కట్టుకొమ్మని కమీషన్లు పొందింది కేసీఆరే

జగన్‌ను ప్రగతి భవన్‌కు పిలిపించి ప్లానిచ్చింది ఆయనే

అల్లుడు దొంగ, మామ గజదొంగ, బామ్మర్ది గంజాబ్యాచ్

బీజేపీతో మంతనాల్లేవని హరీశ్ ఎల్లమ్మపై ఒట్టేస్తాడా?

రబ్బరు చెప్పుల హరీశ్ కుటుంబానికి వేల కోట్లెక్కడివి?

నారాయణ, చైతన్యలకు పాలు పోసే డెయిరీ తనదే

చెల్లెను గెంటేసిన కేటీఆర్.. ఆడబిడ్డలను ఉద్ధరిస్తాడా?

గడ్డం పెరగడానికి 50 ఏళ్లు.. బుద్ధికి ఇంకెన్నేళ్లో

సిద్దిపేటలో గెలిచే ఎమ్మెల్యేకు కీలక మంత్రి పదవి ఇస్తా

శంకరమ్మ సహా ఉద్యమకారులకు పదవులిచ్చింది మేమే

సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు

ఆయనకు వెన్నుపోటు పొడిచిన ఘనుడు కేసీఆర్

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

రూ.544కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



సంగారెడ్డి,/సిద్దిపేట నవంబర్ 19(ప్రజావినికిడి):

"సిద్దిపేట గడ్డ ఇక కాంగ్రెస్ అడ్డా. ఇక్కడ గెలిచే ఎమ్మెల్యేకు కీలకమైన మంత్రి పదవి ఇస్తాం. కార్యకర్తలు, నాయకులు చర్చించి ఒకరి పేరు చెబితే వచ్చే ఎన్నికల్లో వారికే టికెట్ ఇస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం"ను ఆయన ప్రారంభించారు. రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు సంబంధించి రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా సభలో 70 నిమిషాల పాటు సాగిన ముఖ్యమంత్రి ప్రసంగంలో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై విరుచుకుపడ్డారు. "మొన్నటిదాకా కేసీఆర్, ఇప్పుడు హరీశ్‌రావు... రేపు కేసీఆర్ అన్నకొడుకు అడుగుపెట్టేందుకు ఫ్లెక్సీలుమిగతాది 2లో...



టాక్స్ తగ్గించాం.. జీతాలు పెంచారా?

ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన ప్రధాని మోదీ

సంస్కరణల ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన

ఉద్యోగుల వేతనాలను ఎంత పెంచారో పరిశ్రమలు నిరూపించుకోవాలని వెల్లడి

దేశీయ వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యత ఇవ్వాలని ఆదేశం

ఫార్మా ఏపీఐలు, స్టీల్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపు

న్యూఢిల్లీ నవంబర్ 19(ప్రజావినికిడి):

కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతాది 2లో...



రోడ్డు ప్రమాదాలను చూస్తే కన్నీళ్లొస్తున్నాయి

దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు

1.80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తగ్గితే కఠిన చర్యలు

మౌలిక సదుపాయాలే ఆర్థికాభివృద్ధికి వెన్నెముక

ఐఆర్‌సీ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

హైదరాబాద్, నవంబర్ 19(ప్రజావినికిడి):

దేశంలో ఏటా సుమారు 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దాదాపు 1.80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో దాదాపు 66 శాతం మంది 18 నుంచి మిగతాది 2లో...

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్


విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి

గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని

సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్



అమరావతి నవంబర్ 19(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మిగతాది 2లో...

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు వద్దు

రెండు తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టమైన ఆదేశాలు



అమరావతి హైదరాబాద్, నవంబర్ 19(ప్రజావినికిడి):

కృష్ణా నదీ జలాల వినియోగానికి సంబంధించి తమ అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టవద్దని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను హెచ్చరించింది. మిగులు జలాలు అందుబాటులో ఉంటాయనే అంచనాతో ప్రాజెక్టులు నిర్మించినంత మిగతాది 2లో...

బీఎస్ 6 వాహనాలకు ఇక మూడేళ్లకోసారి పీయూసీసీ



హైదరాబాద్, నవంబర్ 19(ప్రజావినికిడి):

భారత్ స్టేజ్ (బీఎస్) వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ (పీయూసీసీ) వ్యాలిడిటీ విషయంలో పలు కీలక మార్పులు చేసింది. బీఎస్ 6 వాహనాలకు ప్రస్తుతం సంవత్సరానికి ఒకసారి పీయూసీసీమిగతాది 2లో...

ఇది ప్రజాపాలన కాదు.. అవినీతిపాలన!

20 శాతం కమీషన్ లేనిదే పనులు కావడం లేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలే ప్రభుత్వ అవినీతికి నిదర్శనం: కేటీఆర్

రూ.4 వేల పెన్షన్ హామీ ఏమైంది?



హైదరాబాద్, నవంబర్ 19(ప్రజావినికిడి):

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందించడం లేదని, అవినీతి పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ప్రభుత్వంలో 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు జరగడంమిగతాది 2లో...

ప్రపంచ శాంతి కోసం కలిసి పనిచేద్దాం

ఆ బాధ్యత మనపై ఉంది : జిన్‌పింగ్, పుతిన్, ట్రంప్

షెన్‌జెన్: (ప్రజావినికిడి):

ప్రపంచ శాంతి, భద్రతను కాపాడేందుకు ప్రధాన శక్తులైన అమెరికా, చైనా, రష్యా దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయా దేశాల అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. గురువారం జరిగినమిగతాది 2లో...



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

కడుతున్నారు. సిద్దిపేట ఏమైనా అనాథల రాజ్యమా? వాళ్లకు పదవులిస్తే వేలకోట్లు దోచుకున్నారు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. కార్యకర్తలు, ప్రజలు అనుకుంటే మళ్లీ సాధ్యమే. సిద్దిపేటలోనే కాదు, 2029లో తెలంగాణలో గెలిచేది కాంగ్రెస్సే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్తు లేదు" అని అన్నారు.

కృష్ణా జలాల విషయంలో తనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ అన్నారు. "నేను తెలంగాణ బిడ్డను. ఈ గడ్డపై పుట్టినోడిని. చిన్న వయసులోనే పెద్ద బాధ్యత ఇచ్చారు. ఈ గడ్డకు నేనెందుకు అన్యాయం చేస్తా? చంద్రబాబుతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని కూడా తెంచుకున్నా. తెలంగాణ ప్రజల కోసం 2017లోనే టీడీపీని వదిలా" అని ఉద్వేగంగా చెప్పారు. వైఎస్సార్ వేసిన మెతుకులకు ఆశపడి పోతిరెడ్డిపాడు విషయంలో హరీశ్‌రావు వంత పాడారని ఆరోపించారు. జగన్‌ను ప్రగతిభవన్‌కు పిలిపించి రాయలసీమ లిఫ్టుకు ప్లాన్ ఇచ్చి కమీషన్లు తీసుకున్న చరిత్ర కేసీఆర్‌దేనన్నారు. "రోజమ్మ వండిపెట్టిన రొయ్యల పులుసు తిన్నది నువ్వు కాదా కేసీఆర్?" అని ప్రశ్నించారు.

కేసీఆర్‌ను సింగిల్‌విండో డైరెక్టర్‌గా గెలిపించింది కాంగ్రెస్సేనని రేవంత్ గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్‌లో పదవి ఇచ్చి ఆయనకు రాజకీయ భిక్ష పెట్టింది అప్పటి సిద్దిపేట ఎమ్మెల్యే, మంత్రి అనంతుల మదన్‌మోహన్ అన్నారు. అలాంటి వ్యక్తిపైనే 1983లో కేసీఆర్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారని చెప్పారు. తనను ఎమ్మెల్యేను, మంత్రిని చేసిన చంద్రబాబుకూ కేసీఆర్ వెన్నుపోటు పొడిచారన్నారు. తెలంగాణ ఇస్తే టిఆర్ఎస్‌ను విలీనం చేస్తానని చెప్పి, కేంద్రమంత్రి పదవి తీసుకుని కాంగ్రెస్‌నూ మోసం చేశారని మండిపడ్డారు. 'కత్తిని నమ్ముకున్నవాడు కత్తికే బలవుతాడు' అన్నట్లు కేసీఆర్ ఏదో ఒకరోజు అదే వెన్నుపోటుకు బలవుతారని ఎద్దేవా చేశారు.

సభలో కేసీఆర్‌పై ముఖ్యమంత్రి ఒక దెయ్యం కథ చెప్పి నవ్వులు పూయించారు. విముక్తి కోసం ఎవరికైనా సాయం చేయాలనుకున్న ఓ దెయ్యం ఎర్రవెల్లి పొలంలో లుంగీ కట్టుకుని బీడీ తాగుతున్న ఓ బక్కటాయనను కలిసింది. పంటను సగం సగం పంచుకుందామన్న ఆ మనిషి ప్రతిసారీ మోసం చేశాడు. పైపంట దెయ్యానికి అంటే పల్లీ, కిందిపంట దయ్యానిది అంటే వరి, పైన కింద రెండూ దయ్యం వాటా అంటే మక్కలు వేశాడు. ఇదీ ముఖ్యమంత్రి చెప్పిన కథ. "ఆ మనిషే కేసీఆర్. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను మోసం చేశాడు"



అని కథ ముగించారు. 'నమ్మితిరా సిద్దా అంటే ముంచితిరా రంగా' అన్నట్లు కేసీఆర్ తీరు ఉంటుందని, ఆయనకు కుటుంబం తప్ప ఎవరూ అక్కర్లేదని విమర్శించారు.కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని హరీశ్‌రావుకు కాంగ్రెస్ దయతోనే వైఎస్సార్ మంత్రిగా అవకాశం ఇచ్చారని రేవంత్ అన్నారు. రబ్బరు చెప్పులతో రాజకీయాల్లోకి వచ్చిన హరీశ్‌కు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. ఆయన తమ్ముడు, బావమరిది సుమన్‌రావు, సతీమణి, మామ పేర్లపై భూములు, ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. "అల్లుడు దొంగ, మామ గజదొంగ, బావమరిది గంజాయి బ్యాచ్" అని వ్యాఖ్యానించారు. శ్రీచైతన్య, నారాయణ కాలేజీలు, కార్పొరేట్ ఆసుపత్రులకు పాలు సరఫరా చేసే కాంట్రాక్టు హరీశ్‌కు చెందిన ముకుంద డెయిరీదేనని ఆరోపించారు. హరీశ్ వచ్చే ఎన్నికల వరకు బీఆర్ఎస్‌లో ఉండరని, బీజేపీ నేతలతో మంతనాలు సాగిస్తున్నారని అన్నారు. "బీజేపీతో మంతనాలు చేయడం లేదని సిద్దిపేట ఎల్లమ్మపై ఒట్టేసి చెబుతావా?" అని సవాల్ విసిరారు. కాళేశ్వరంలో భారీ అవినీతి చేసినందుకే హరీశ్‌కు రెండోసారి నీటిపారుదల శాఖ ఇవ్వలేదన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాకే చెందిన జగ్గారెడ్డి కేసీఆర్ కుటుంబంతోనే రాజకీయాలు ప్రారంభించారని, ఆయన అప్పుల్లో కూరుకుపోతే వీళ్ల కుటుంబం మాత్రం వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆస్తుల పంపకాల్లో అడ్డుగా ఉందని సొంత చెల్లెను మెడపట్టి ఇంట్లోంచి గెంటేశారని కేటీఆర్‌పై సీఎం ఆరోపించారు. అలాంటి కేటీఆర్ రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలను ఉద్ధరిస్తాడంటే నమ్ముతారా అని ప్రశ్నించారు. "కేటీఆర్‌కు గడ్డం పెరగడానికి 50 ఏళ్లు పట్టింది. బుద్ధి పెరగడానికి ఇంకెన్నేళ్లు పడుతుందో" అని ఎద్దేవా చేశారు. జన్వాడ ఫాంహౌస్‌లో గంజాయి బ్యాచ్‌లతో ఎంజాయ్ చేసే మనిషి అక్కాచెల్లెళ్లను ఆదరిస్తాడా అని ధ్వజమెత్తారు. బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు. ఇందిరమ్మ చీరలు మాత్రం ఆడబిడ్డలకు అందం తెచ్చాయని అన్నారు. "తూ.. మీ బతుకు చెడ" అంటూ శాపనార్థాలు పెట్టారు.ఉద్యమకారులను వాడుకుని ఆత్మ బలిదానాలకు ప్రోత్సహించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వారికి పదవులు ఇవ్వలేదని రేవంత్ ఆరోపించారు. ఇటీవల లక్ష్మణ్‌గౌడ్ అనే ఉద్యమకారుడు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం, సన్నిహితులు అందుకున్న పదవులను సీఎం ఏకరువు పెట్టారు. కేసీఆర్‌కు సీఎం పదవి, కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు, బిడ్డకు ఎంపీ, ఓడిపోగానే ఎమ్మెల్సీ, బంధువు వినోద్‌కుమార్ ఎంపీగా ఓడగానే ప్లానింగ్ కమిషన్ పదవి, సంతోష్‌రావుకు రాజ్యసభ, ప్రతిమ శ్రీనివాస్‌కు వేలకోట్ల కాంట్రాక్టులు, ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంత్రి పదవి ఇచ్చుకున్నారని వివరించారు. ఇన్ని ఇచ్చుకున్నవాళ్లకు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఇవ్వడానికి ఒక్క పదవి కూడా లేదా అని ప్రశ్నించారు. ఆ తల్లి గుండెకోతను అర్థం చేసుకోకుండా బీఆర్ఎస్ అవమానించిందన్నారు. తాము ఆమెకు పదవి ఇచ్చామని, భవిష్యత్తులోనూ తగిన గౌరవం ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం మాట్లాడుతుండగా శంకరమ్మ ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఇది ప్రజాపాలన కాదు.. అవినీతిపాలన!

(మొదటి పేజీ తరువాయి)

లేదని స్వయంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలే ప్రభుత్వ అవినీతికి నిదర్శనమని అన్నారు.

గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భూపాలపల్లి ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

పనులు జరగాలంటే పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వయంగా చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై రూ.5 లక్షల కోట్ల దోపిడీ, టెండర్లలో అవినీతి, పలు కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.15 వేలు పంచితే ప్రజలు ఓట్లు వేస్తారనే భ్రమలో ముఖ్యమంత్రి ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. మరో ఏడాది తర్వాత రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతుందని అన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును కక్కిస్తామని, అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

రాష్ట్రంలో పెన్షన్ల సంఖ్యను తగ్గించి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 44.70 లక్షల మందికి పెన్షన్లు అందేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతల్లో మొత్తం 4.70 లక్షల పెన్షన్లకు కోత విధించిందని ఆరోపించారు. మరోవైపు కొత్తగా 4.63 లక్షల పెన్షన్లు మంజూరు చేసినట్లు ప్రచారం చేస్తున్నారని, తొలగించిన పెన్షన్లతో పోలిస్తే కొత్తగా ఇచ్చినవి ఏడు వేలు తక్కువగా ఉన్నాయని వివరించారు.

ఎన్నికల సమయంలో పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ రూ.2 వేలే అందిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంలోని పెద్దలను ప్రశ్నించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీ పార్టీలకు బాడీగార్డుల్లా వ్యవహరిస్తూ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. జాతీయ నాయకులు రాష్ట్రానికి వచ్చినప్పుడు రాష్ట్ర నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రస్తావిస్తూ కాంగ్రెస్, బీజేపీ నేతలపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రయోజనాల కంటే ఢిల్లీ నాయకుల మెప్పు పొందడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

ప్రపంచ శాంతి కోసం కలిసి పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

త్రైపాక్షిక సమావేశంలో ప్రపంచ శాంతి, స్థిరత్వాల పరిరక్షణకు పరస్పర సహకారం ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు.

రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఫాసిస్టు వ్యతిరేక కూటమిలో మూడు దేశాలు కలిసి పోరాడి విజయం సాధించిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తు చేశారు. ఎనిమిది దశాబ్దాల క్రితం సాధించిన విజయాలు ప్రపంచ శాంతి పరిరక్షణకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఆ చారిత్రక అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ భవిష్యత్తులోనూ మూడు దేశాలు సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో పరస్పర సహకారం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చల మార్గాలను ఎప్పుడూ తెరిచి ఉంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. విభేదాలు ఉన్న దేశాలతోనూ చర్చలు జరపాల్సిన బాధ్యత ప్రధాన శక్తులపై ఉందని పేర్కొన్నారు. ప్రత్యర్థి దేశాలతో చర్చలకు నిరాకరించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. ప్రత్యక్ష చర్చలు, పరస్పర సంభాషణల ద్వారానే వివాదాలకు పరిష్కారాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అణ్వాయుధ నిరాయుధీకరణ అంశంపై చర్చించినట్లు ట్రంప్ వెల్లడించారు. అణ్వాయుధాలను వదులుకునేలా దేశాలను ఒప్పించడం సవాలుతో కూడుకున్న వ్యవహారమని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.జిన్‌పింగ్, పుతిన్‌లతో కలిసి మరింత సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు కొత్త మార్గాలను అన్వేషించడమే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ వ్యాప్తి ముప్పును అరికట్టేందుకు మూడు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌తో ఇప్పటికే సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.మూడు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభిప్రాయపడ్డారు. ఆహార భద్రత, ఇంధన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో పరస్పర సహకారం అవసరమని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ఇతర ప్రాంతీయ వివాదాల పరిష్కారంలోనూ మూడు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.మాస్కో, బీజింగ్, వాషింగ్టన్ మధ్య పరస్పర గౌరవం, సమతుల్య ప్రయోజనాలతో కూడిన నిర్మాణాత్మక సహకారం ప్రపంచ స్థిరత్వానికి దోహదపడుతుందని పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దులు దాటుతున్న వ్యవస్థీకృత నేరాలను అరికట్టేందుకు కూడా మూడు దేశాలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు.

విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, అందులో రూ.5.70 లక్షల కోట్లు కేవలం గ్రీన్ ఎనర్జీ రంగంలోనే నమోదయ్యాయని వివరించారు. రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్, మూడేళ్ల లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్వాంటం హబ్‌గా అమరావతి

అమరావతి ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్ 'క్వాంటం కారిడార్'గా, క్వాంటం వ్యాలీ, క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత పురోగతికి కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల అనుసంధానం - నాలెడ్జ్ పార్టనర్లు

భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలు అందించేలా ఎంఎస్ఎంఈలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను రీసైక్లింగ్ చేసే నూతన సాంకేతికతలపై దృష్టి పెట్టాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

పర్యాటకానికి మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో పర్యాటకాన్ని లాభదాయక ఆర్థిక వనరుగా మార్చాలని సీఎం పిలుపునిచ్చారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సు ప్రతినిధులను అక్కడికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, గండికోట పర్యాటక ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిఫై చేయాలని ఆదేశించారు.

ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలన్నారు. అమరావతి-నాగార్జునకొండలను అనుసంధానిస్తూ బౌద్ధ సర్క్యూట్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు.

టాక్స్ తగ్గించాం..జీతాలు పెంచారా?

(మొదటి పేజీ తరువాయి)



వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు.దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు.

దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్ గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వర్గాలకు సూచించారు.

బీఎస్ 6 వాహనాలకు ఇక మూడేళ్లకోసారి పీయూసీసీ

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తుండగా.. దానిని మూడేళ్లకు పెంచారు. దీంతో బీఎస్ 6 వాహనాదారులు తమ వాహనాలకు ఏడాదికోసారి రెన్యువల్ చేయించాల్సిన అవసరం ఉండదు. మూడేళ్లకోసారి చేయిస్తే సరిపోతుంది. అలాగే, బీఎస్ 6 వాహనాలకు పీయూసీసీ వ్యాలిడిటీని 6 నెలలకు, అంతకన్నా పాత వాహనాలకు మూడు నెలలకు తగ్గించారు. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల చట్టం నిబంధనలు 2026ను కేంద్రం నోటిఫై చేసింది.

తాజా నిబంధనల ప్రకారం.. కొత్త వాహనం కొంటే మూడేళ్లకోసారి చొప్పున ఆరు సంవత్సరాల్లో రెండుసార్లు పీయూసీసీ చేయించాలి. 6 నుంచి 10 ఏళ్ల వాహనానికి ఏటా రెన్యువల్ చేయించాలి. పదేళ్లు పైబడితే ఆరునెలలకు ఒకసారి రెన్యువల్ చేయించాలి. బీఎస్ 6 రవాణా వాహనాలకు ఫస్ట్ రిజిస్ట్రేషన్ తర్వాత ఆరేళ్ల వరకు ప్రతి రెండేళ్లకు ఒకసారి పీయూసీసీ చేయించాలి. 6 నుంచి 10 ఏళ్ల వరకు ఏటా రెన్యువల్ తప్పనిసరి. వాహనం పదేళ్లు దాటితే ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెన్యువల్ తప్పనిసరి. అలాగే బీఎస్ 1, 2, 3 వాహనాల పీయూసీసీ వ్యాలిడిటీని మూడు నెలలకే పరిమితం చేశారు. బీఎస్ 4 వాహనాలకు రెన్యువల్ గడువును 6 నెలలకు తగ్గించారు. ప్రస్తుతం పర్సనల్ బీఎస్ 1, 2, 3, 4 వాహనాలకు ప్రతి ఆరునెలలకు ఒకసారి పీయూసీసీ రెన్యువల్ నిబంధన అమల్లో ఉంది

రోడ్డు ప్రమాదాలను చూస్తే కన్నీళ్లొస్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

34 ఏళ్ల మధ్య వయస్కులేనని తెలిపారు. ఇది తనకెంతో బాధ కలిగిస్తోందని, కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి తక్షణమే సరిచేయాలని ఆదేశించారు. డీపీఆర్‌లను అర్హత కలిగిన నిపుణులతోనే రూపొందించాలని, తక్కువ ధరకు కోట్ చేసిన వారికే పనులు అప్పగించే విధానానికి స్వస్తి పలకాలని సూచించారు.గురువారం హైదరాబాద్‌లో జరిగిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) వార్షిక సమావేశానికి గడ్కరీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రోడ్ల నిర్మాణానికి ముందు, తర్వాత భద్రతా ఆడిట్లు నిర్వహించాలని, అవసరమైన చోట్ల ఫ్లై ఓవర్లు, అండర్‌పావీసలు, సురక్షితమైన జంక్షన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి ఇంజనీర్ రోడ్డు భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని, ప్రమాద మరణాలు సున్నాకు చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో తాను కూడా రోడ్డు ప్రమాదంలో నాలుగు చోట్ల ఎముకలు విరిగి రెండేళ్లపాటు ఇంటికే పరిమితమయ్యానని తెలిపారు. రహదారులు, వంతెనలు, సొరంగ మార్గాల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని, బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణలో ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, ప్రభుత్వ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర మంత్రి గడ్కరీ అభినందించారు. మౌలిక సదుపాయాలే ఆర్థికాభివృద్ధికి వెన్నెముక అని, మౌలిక రంగంలో పెట్టే ప్రతి రూ.100 పెట్టుబడికి సుమారు రూ.325 మేర ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని తెలిపారు. దేశంలో లాజిస్టిక్స్ వ్యయం గతంలో జీడీపీలో 16 శాతం ఉండగా, ప్రస్తుతం సుమారు 9 శాతానికి తగ్గిందన్నారు. మౌలిక రంగంలో పెట్టుబడులకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానాన్ని మరింత ప్రోత్సహించాలని సూచించారు. భారత్ ఏటా సుమారు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ తెలిపారు.

అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రాన ఆ నీటిని వినియోగించుకునే చట్టబద్ధమైన హక్కు లభించదని స్పష్టం చేసింది.

కొత్త ప్రాజెక్టులను ప్రారంభించే ముందు సంబంధిత బోర్డు నుంచి ప్రాజెక్టు మదింపు, సాంకేతిక అనుమతులు తప్పనిసరిగా పొందాలని గుర్త

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శుక్రవారం 20 నవంబర్ 2026

డేటా సెంటర్ల ఏర్పాటుతో ముంచుకొస్తున్న ముప్పుపై ప్రత్యేక కథనానికి గుర్తింపు

ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికైన రమేష్‌ను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తో ఘన సన్మానం..





షాద్‌నగర్,(ప్రజావినికిడి):
డేటా సెంటర్ల ఏర్పాటుతో పర్యావరణానికి, ప్రజల జీవన విధానానికి ముంచుకొస్తున్న ముప్పుపై ప్రజల్లో అవగాహన కల్పించేలా రాసిన ప్రత్యేక కథనానికి గుర్తింపు లభించింది.ఈ అంశంపై సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమగ్రంగా కథనాన్ని అందించిన జర్నలిస్టు రమేష్ ఉత్తమ జర్నలిస్టుగా ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్ లోని నవచేతన విజ్ఞాన సమితి (ప్రజాపక్షం) ప్రధాన కార్యాలయంలో 8వ,వార్షికోత్సవం ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల సమక్షంలో రమేష్‌ను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, డేటా సెంటర్ల ఏర్పాటుతో ఎదురయ్యే పర్యావరణ సమస్యలు,నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, స్థానిక ప్రజలపై పడే ప్రభావం వంటి కీలక అంశాలను తన కథనంలో ప్రస్తావించడం విశేషం.అభివృద్ధి పేరుతో చేపట్టే భారీ ప్రాజెక్టుల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై ప్రజలు, అధికారులు, పాలకులు ఆలోచించాల్సిన అవసరాన్ని ఈ కథనం గుర్తుచేసిందని వివరించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, సమాజ హితం కోసం నిరంతరం కలం పట్టే జర్నలిస్టులకు ఇలాంటి గుర్తింపులు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు రమేష్ మాట్లాడుతూ,ఈ సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని,ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల పక్షాన తన కలం కొనసాగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నవచేతన విజ్ఞాన సమితి (ప్రజాపక్షం) చైర్మన్ పల్లా వెంకటరెడ్డి, రంగారెడ్డి జిల్లా బ్యూరో జంగయ్య గౌడ్, కొత్తూరు ప్రజాపక్షం రిపోర్టర్ అనిల్ కుమార్ గుప్తాలు ఉన్నారు.

ఎన్టీఆర్ అభిమాని,టీడీపీ సీనియర్ నేత బడుగు దానయ్య పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న:మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు





నల్లగొండ,(ప్రజావినికిడి): ఉమ్మడి జిల్లాలోని భూదాన్ పోచంపల్లిలో ఎన్టీఆర్ వీరాభిమాని,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ ఎంపీపీ బడుగు దానయ్య పేరుపైన వారి కుటుంబ సభ్యులు రచించిన పుస్తకాన్ని నేడు తెలుగుదేశం పార్టీ ఆత్మీయ కుటుంబ సభ్యుల మధ్యన ఘనంగా నిర్వహించారు.పుస్తకావిష్కరణ కార్యక్రమానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కరుడుగట్టిన కార్యకర్తగా,నేతగా,భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ)బడుగు దానయ్య విశేష సేవలు అందించారన్నారు. అదేవిధంగా భూదానోద్యమ సిద్ధాంతకర్త వినోబాభావే జయంతి కార్యక్రమాలు క్రమంగా నిర్వహిస్తూ ఉండేవారని, తెలుగుదేశం పార్టీజూ చేనేత విభాగ అధ్యక్షుడుగా,పివిటి మార్కెట్ డైరెక్టర్ గా,అదేవిధంగా టిటిడి,అయోధ్య పవిత్ర పుణ్యక్షేత్రాల పద్మశాలి సంఘం సత్రాల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని బక్కని నరసింహులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పద్మశాలీలకు పార్టీలో విశేష పదవులతో పాటు వారికి అండగా నిలిచిందని,ఈ క్రమంలోనే పద్మశాలి వర్గానికి చెందిన ఎల్.రమణను ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఎనిమిది(8) సంవత్సరాల పాటు నియమించింది అని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో స్వర్గీయ రుమండ్ల రామచంద్రయ్యకు రాజ్యసభ పదవి ఇచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన గుర్తు చేశారు.బడుగు దానయ్యకు ఉన్న అనుబంధాన్ని,ఎన్టీఆర్‌పై ఆయనకున్న అభిమానాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా స్వామిరమణ నంద తీర్థ,గాంధేయవాద సూత్రాలు,భూదానోద్యమ స్ఫూర్తితో గ్రామీణ పేదలకు ఉపాధి,నైపుణ్య శిక్షణ అందించేందుకు 1995 డిసెంబర్ 3న మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు,నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలిసి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను ప్రారంభించారు.ఈ సంస్థ భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో ఉంది.తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షుడు,ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండుసార్లు భూదాన్ పోచంపల్లిని సందర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ చిలువేరు కాశీనాథ్,డిస్టిక్ జడ్జ్ లక్ష్మణ్,మాజీ మంత్రి సునీత మాధవరెడ్డి,రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్,టీడీపీ నాయకులు,దానయ్య అభిమానులు,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సదర్ పండుగను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్





షాద్‌నగర్,(ప్రజావినికిడి):నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో హోటల్ 44లో నిర్వహించిన సదర్ సమ్మేళనం సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ,సదర్ పండుగనుఘనంగా, ఐకమత్యంతో నిర్వహించేందుకు ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున కమిటీ సభ్యులను ఎంపిక చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.కుల బంధువుల మధ్య ఎలాంటి విభేదాలకు తావు లేకుండా, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సదర్ పండుగ అనేది యాదవుల ఆత్మగౌరవానికి,సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని,ఈ వేడుకను అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు.
యాదవ కుల బంధువులందరూ ఐక్యంగా నిలిచి పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన యాదవ సోదరులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్ప స్వామి దర్శించుకున్న తెలంగాణ ఉద్యమకారుడు కాకి నరసింహ ముదిరాజ్



హైదరాబాద్,(వ్రజావినికిడి):కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని గురువారం రోజు తెల్లవారుజామున శ్రీ అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామివారి అనంతరం కాకి నరసింహ మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.వచ్చే వానకాలం వర్షాలు బాగా పడాలని రైతులు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నానని తెలిపారు తిరుగు ప్రయాణంలో మరిన్ని పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు కాకి నరసింహ ముదిరాజ్ నీలం శ్రీకాంత్ ముదిరాజ్ ఢిల్లీ కృష్ణ ఆలూరి శంకర్ మహేందర్ శంకరప్ప ఉన్నారు

ఆదర్శ మ్యాట్రిమోనీ, ఆదర్శ కిరణం పత్రిక వార్షికోత్సవానికి ఈటలకు ఆహ్వానం



హిమాయత్ నగర్, (ప్రజావినికిడి): ఆదర్శ మ్యాట్రిమోని 33 ఏండ్లు,ఆదర్శ కిరణం పత్రిక 16వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో నవంబర్ 27వ తేదీన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీఈటల రాజేందర్ రానున్నట్టు ఆదర్శ మ్యాట్రిమోని, ఆదర్శ కిరణం పత్రిక ఛైర్మెన్, సంపాదకులు వంగాల బాలరాజ్ గౌడ్ తెలిపారు.ఈ మేరకు ఈటల నివాసంలో వారిని గౌరవ ప్రదంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అంతేగాకుండా ఈ కార్యక్రమానికిమధు యాష్కి గౌడ్,కొండా దేవయ్య పటేల్, జాజుల శ్రీనివాస్ గౌడ్,కందగట్ల స్వామి,పల్లె లక్ష్మణ్ గౌడ్, ఎన్ఆర్ఐ వేద నక్షత్రం, గూడాల శ్రీధర్, కార్పొరేటర్స్, పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్టు వంగాల తెలిపారు.ఈ కార్యక్రమంలో తాము వివాహాలు కుదిర్చిన వారికి, తమ పత్రిక చందాదారులకు, కస్టమర్లకు బహుమతులను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వంగాల బాలరాజ్ గౌడ్ అభిలాషించారు. ఈటలకు ఆహ్వాన పత్రిక అందించిన వారిలో దాసి సాంబయ్య, చిక్కా దేవదాసు, గడ్డమీది కల్యాణి గౌడ్ తదితరులు ఉన్నారు.

చదరంగం పోటీలను ప్రారంభించిన మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం



షాద్ నగర్,(ప్రజావినికిడి): పట్టణంలో గ్రేడ్-వన్ శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రంథాలయ59వవారోత్సవాలను పురస్కరించుకొని భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చదరంగం పోటీలను చెస్ మాస్టర్ వానరాశి జగన్ ఆధ్వర్యంలో షాద్ నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ పాటకులకు చాక్లెట్లు,అరటి పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి,వైస్ చైర్మన్ లు నక్క బాల్ రాజ్ యాదవ్,సి.వీరేష్,ప్రధాన కార్యదర్శి క్యూసెట్ శ్రీనివాసులు,జాయింట్ సెక్రెటరీ జూపల్లి చంద్రశేఖర్,కోశాధికారి నీళ్ల రవీందర్ గౌడ్,సంయుక్త కోశాధికారి కత్తి చంద్రశేఖర్ అప్ప,డైరెక్టర్లు రవి నాయక్, శ్రీకాంత్,కృష్ణారెడ్డి,గ్రంథాలయ పాటకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నా పేరు వాడితే మైలేజ్.. అందుకే కొందరు నాపై విమర్శలు చేస్తున్నారు: సజ్జనార్

హైదరాబాద్, నవంబరు 19(ప్రజావినికిడి):
సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ గురువారం తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవల విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ)గా బాధ్యతలు స్వీకరించారు. దీనితో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీగా కూడా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సజ్జనార్, తనపై వస్తున్న ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. కొంత మంది తమ ఉనికి కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తన పేరు వాడితే మైలేజ్ వస్తుందనే ఉద్దేశంతోనే కొందరు చూస్తున్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారు కచ్చితంగా చట్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. వీటన్నింటికీ సమయమే సమాధానం చెబుతుందని, దీనికోసం తాను రోడ్డెక్కి మాట్లాడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.తన కెరీర్ గురించి ప్రస్తావిస్తూ... 26 ఏళ్ల సర్వీసులో తనకు ఇప్పటికే 20 సార్లు బదిలీలు అయ్యాయని సజ్జనార్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఏ పోస్టింగ్ ఇచ్చినా తన వంతుగా బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన శాఖాపరమైన అంశాలపై సమీక్షించారు. అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర సహాయక చర్యలు, భద్రతా నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విద్యుత్ వినియోగదారులకు తీరనున్న లో వోల్టేజ్ సమస్యలు -విద్యుత్ శాఖ



షాద్ నగర్,(ప్రజావినికిడి): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ పీటీఆర్‌ను గురువారం విజయవంతంగా ఛార్జ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక,ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షల మేరకు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్,ఐఏఎస్ మార్గదర్శకత్వంలో, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్,ఐఏఎస్ ఆదేశాలతో నెట్‌వర్క్ విస్తరణ పనులను టీజీఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు ప్రాధాన్యతగా చేపడుతున్నారు.ఇందులో భాగంగా,
షాద్‌నగర్ డివిజన్,రాజేంద్రనగర్ సర్కిల్, రంగారెడ్డి ఆర్ జోన్ పరిధిలో పీటీఆర్ ఎన్‌హాన్స్‌మెంట్ పనుల్లో భాగంగా 33/11 కేవీ షాద్‌నగర్ టౌన్ సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ పీటీఆర్‌ను గురువారం విజయవంతంగా ఛార్జ్ చేశారు.

పిటిఆర్ తో తీరనున్న వినియోగదారుల సమస్యలు

సామర్థ్యం పెరిగిన ఈ కొత్త పీటీఆర్‌తో షాద్‌నగర్ పట్టణంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగైన విధంగా మారనుంది అని అన్నారు.ఓవర్‌లోడ్ సమస్యలు తగ్గి,తక్కువ వోల్టేజ్ ఇబ్బందులు తొలగి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది. గృహ,వ్యవసాయ, వాణిజ్య వినియోగదారులందరికీ ప్రయోజనం చేకూరుతుంది.ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించడానికి టీజీఎస్పీడీసీఎల్ ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రంగారెడ్డి జిల్లా జోన్ గోపయ్య,సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజేంద్రనగర్ రవి ప్రసాద్,జనరల్ మేనేజర్ ఆర్ఆర్ జోన్ అంజయ్య,డీఈ ఆపరేషన్ షాద్‌నగర్ శ్యామ్ సుందర్ రెడ్డి,డీఈటీఆర్ఈ ప్రొటెక్షన్ భాస్కర్ రావు తేజావత్, డీఈఎంఆర్‌టీరాజేంద్రనగర్ కమల్ కుమార్,డీఈనిర్మాణం గణేష్ శ్యామ్,ఏడీఈలు,ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు

హాజిపల్లిలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం,పేదల సంక్షేమమే ఇందిరమ్మకు నిజమైన నివాళి: ఎమ్మెల్యే



షాద్ నగర్,(ప్రజావినికిడి):
భారత మాజీ ప్రధాని,ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలం హాజిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు సూరం లక్ష్మమ్మ నూతన గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి గృహప్రవేశం చేయించారు.ఒకవైపు దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత విగ్రహావిష్కరణ, మరోవైపు పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, దేశం కోసం,దేశ ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు.స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు కాంగ్రెస్ పార్టీకి విశిష్టమైన చరిత్ర ఉందని,దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబంగా ఇందిరాగాంధీ కుటుంబం చరిత్రలో నిలిచిపోయిందన్నారు.పేదలకు భూములు పంచడం, భూసంస్కరణలు అమలు చేయడం, నిరుపేదలకు గూడు కల్పించడం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో ఇందిరాగాంధీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరాగాంధీ విగ్రహ దాత సింగారం సుదర్శన్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు విష్ణుకుమార్,గ్రామ సర్పంచ్ చించుటి కుమార్,ఉప సర్పంచ్ గంగాధర్,వార్డు సభ్యులు,మాజీ సర్పంచ్ జంగమ్మ,గ్రామ పెద్దలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు,గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు

అయ్యప్ప పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
మన్సురాబాద్ డివిజన్ బారస పార్టీ సీనియర్ నాయకులు గురుస్వామి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి కలెక్టర్‌కు ఊరట

జైలుశిక్ష ఉత్తర్వులను సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్



హైదరాబాద్, నవంబరు 19(ప్రజావినికిడి):
ఓ కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డికి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఊరట లభించింది. ఆయనకు హైకోర్టు సింగిల్ జడ్జి విధించిన ఆరునెలల జైలుశిక్ష ఉత్తర్వులను డివిజన్ బెంచ్ గురువారం సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని మన్నె ముత్యాలమ్మ కుంటలో పిటిషనర్లు పీ శివలీల, పీ వెంకటేశ్వర్లులకు చెందిన ప్లాట్ నెంబర్లు 62, 59లను రిజిస్ట్రేషన్ యాక్ట్ - 1908 సెక్షన్ 22ఏ (నిషేధిత జాబితా) నుంచి 60 రోజుల్లో తొలగించాలంటూ గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు.ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో పిటిషనర్లు కలెక్టర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు తేలడంతో ఆయనకు ఆరునెలల జైలుశిక్ష, జరిమానా పడింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పుపై అప్పీల్ చేయగా జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ రేణుకలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. కలెక్టర్ తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఆ ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి కలెక్టర్ చేసిన ప్రయత్నాలను వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై సస్పెన్షన్ విధిస్తూ విచారణను వచ్చే ఏడాది జనవరి 5కు వాయిదా వేసింది. అయితే ప్లాట్ల విషయమై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ఆరువారాల్లో అమలు చేసి నివేదికను సమర్పించాలని ఆదేశించింది.

హైదరాబాద్ మెడికల్ షాపులపై ప్రభుత్వం కొరడా.. 90 దుకాణాల్లో అక్రమాలు వెలుగులోకి




హైదరాబాద్, నవంబరు 19(ప్రజావినికిడి):
రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ విక్రయాలు, యాంటీబయాటిక్స్ విచ్చలవిడి అమ్మకాలను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) డ్రగ్స్ విభాగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు మెడికల్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించింది.కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, పంజాగుట్ట, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా పలు కీలక ప్రాంతాల్లో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 90 మెడికల్ షాపుల్లో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు టీజీ సేఫ్ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ట్రామడాల్, అల్ప్రాజోలం, కోడైన్ సిరప్‌ల వంటి మత్తు కలిగించే ఔషధాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాలకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశామని, నిబంధనల తీవ్రతను బట్టి లైసెన్సులను సస్పెండ్ చేయడం లేదా శాశ్వతంగా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.
మరోవైపు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రబొర్రు గ్రామంలో అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న షేక్ మస్తాన్ వలీ అనే నకిలీ వైద్యుడి వ్యవహారాన్ని అధికారులు బట్టబయలు చేశారు. సదరు క్లినిక్‌పై దాడి చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన సుమారు రూ. 42 వేల విలువైన 34 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ మందులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడటంపై అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్ విక్రయించడం వల్ల యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ సమస్య తీవ్రమవుతుందని, అలాగే స్టెరాయిడ్ల వాడకం వల్ల రోగనిరోధక శక్తి క్షీణించి ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు.

పొట్లపల్లి శ్రీధర్ రావు కుమార్తె వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు





స్టేషన్ ఘన్‌పూర్/ నవంబర్ 19 (ప్రజావినికిడి):
చిల్పూర్ మండలంలోని చిల్పూర్ గుట్ట దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కిరణ్మయి దంపతుల కుమార్తె కుందన వివాహ వేడుక హైదరాబాద్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులు కుందన పృథ్వీలను ఆశీర్వదించారు.ఈ వేడుకకు మాజీ మంత్రి కడియం శ్రీహరి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నాయకులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వివాహ వేడుకలో పాల్గొన్నారు.

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ వ్యాఖ్యలను పార్టీ హైకమాండ్ నిశితంగా గమనిస్తోంది: మహేశ్ గౌడ్



హైదరాబాద్, నవంబరు 19(ప్రజావినికిడి):
కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ పరంగా అందరూ సమానమేనని, నేతలు ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సొంత పార్టీ తీరుపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
సదరు ఎమ్మెల్యేల ప్రకటనలను పార్టీ అధిష్ఠానం నిశితంగా గమనిస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణకు త్వరలో రానున్న కొత్త పార్టీ ఇన్‌ఛార్జ్ ఈ పరిణామాలను సమగ్రంగా పరిశీలిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ఒక ప్రజాస్వామిక పార్టీ అని, దేనికైనా సరైన సమయం ఉంటుందని పేర్కొన్నారు. గతంలో కొండా సురేఖ వ్యవహారంలోనూ చర్యలకు ముందు పలు అవకాశాలు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.ఇదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి విషయంలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అంగీకరించిందని, ఇప్పుడు కేంద్ర బలగాలు డ్యామ్‌ల వద్ద ఉండటానికి ఆ నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. దక్షిణ తెలంగాణకు కీలకమైన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పదేళ్లపాటు పక్కన పెట్టారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో సుమారు రూ.1.84 లక్షల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆరోపిస్తూ, కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన 70 శాతం వాటా కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని ఆయన తెలిపారు.
అంతకుముందు, హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు వద్ద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి మహేశ్ కుమార్ గౌడ్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. దేశ సమగ్రతకు, పేదల సంక్షేమానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె ఆశయాల సాధనలో భాగంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల.. ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్ పరీక్షలు

హైదరాబాద్, నవంబరు 19(ప్రజావినికిడి):
తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన కీలక ప్రక్రియ ప్రారంభమైంది. రాబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి (ఐ+దీ×ఙ) అధికారికంగా ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన జనరల్, ఒకేషనల్ విభాగాల పరీక్షల తేదీలను బోర్డు కార్యదర్శి కె.ఆర్. అభిలాష్ అభినవ్ వెల్లడించారు.ఈ షెడ్యూల్ ప్రకారం థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభమై మార్చి 20 వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. థియరీ కంటే ముందే ప్రాక్టికల్ పరీక్షల ప్రక్రియ పూర్తవుతుంది.

చైనా ఆధిపత్యంపై క్వాడ్ ఆందోళన

● ఇండో-పసిఫిక్‌లో వ్యూహాత్మక సమతుల్యతకు ప్రాధాన్యం.. పరస్పర సహకారమే కీలకం



ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో చైనా తన ప్రభావాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో కూడిన క్వాడ్ కూటమి ఆందోళన చెందుతోంది. వాణిజ్యం, సాంకేతిక రంగం, సముద్ర మార్గాలు, కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థలపై చైనా పెంచుకుంటున్న ఆధిపత్యం ఇతర దేశాలకు సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛ, భద్రత, స్థిరత్వాన్ని కాపాడటం క్వాడ్ దేశాల ప్రధాన లక్ష్యంగా మారింది.చైనా ఆర్థిక బలం, సైనిక సామర్థ్యం, సాంకేతిక పురోగతితో అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా సముద్ర వాణిజ్య మార్గాలపై ప్రభావం పెంచుకోవడం, అరుదైన ఖనిజాల సరఫరాపై నియంత్రణ, సాంకేతిక రంగాల్లో ఆధిపత్యం సాధించడం వంటి అంశాలు ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక్క దేశంపై అధికంగా ఆధారపడే పరిస్థితులు ఏర్పడితే ఆర్థిక, వ్యూహాత్మక పరంగా ఇతర దేశాలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందుకే ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థల ఏర్పాటుపై క్వాడ్ దేశాలు దృష్టి సారిస్తున్నాయి.భారత్‌కు ఈ పరిణామాలు అత్యంత కీలకమైనవి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో సముద్ర భద్రత, వాణిజ్య ప్రయోజనాలు, సరిహద్దు భద్రత వంటి అంశాల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. క్వాడ్ భాగస్వామ్యం ద్వారా భారత్ తన వ్యూహాత్మక సంబంధాలను విస్తరించుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ రంగం, పెట్టుబడులు, కీలక వనరుల సరఫరాలో సహకారాన్ని పెంపొందించుకోవచ్చు. అయితే ఏ ఒక్క కూటమిపై పూర్తిగా ఆధారపడకుండా స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించడం కూడా భారత్‌కు అవసరం.క్వాడ్ కూటమి కేవలం చైనాను అడ్డుకోవడానికే పరిమితం కాకుండా, ప్రాంతీయ దేశాల అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టాలి. మౌలిక సదుపాయాల కల్పన, సముద్ర వాణిజ్య భద్రత, విపత్తుల నిర్వహణ, సాంకేతిక సహకారం, ఆరోగ్య రంగం, ఇంధన భద్రత వంటి అంశాల్లో భాగస్వామ్యం పెంచుకోవాలి. చిన్న, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందించడం ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో విశ్వసనీయతను పెంచుకోవచ్చు.అదే సమయంలో చైనాతో సంబంధాలను పూర్తిగా దెబ్బతీసుకునే విధంగా వ్యవహరించడం కూడా ప్రయోజనకరం కాదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా కీలక భాగస్వామిగా ఉన్నందున పోటీతో పాటు దౌత్య సంబంధాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ఘర్షణలు పెరిగితే వాణిజ్యం, పెట్టుబడులు, ప్రపంచ సరఫరా వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్ల క్వాడ్ దేశాలు వ్యూహాత్మక అప్రమత్తతతో పాటు సంయమనం పాటించాలి.చైనా ఆధిపత్యంపై ఆందోళన వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా, ఆ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా బలమైన ఆర్థిక, సాంకేతిక, వాణిజ్య వ్యవస్థలను నిర్మించుకోవడం క్వాడ్ దేశాల ముందున్న అసలు సవాలు. పరస్పర విశ్వాసం, సమన్వయం, దీర్ఘకాలిక కార్యాచరణతో ముందుకు సాగితేనే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సమతుల్యత సాధ్యమవుతుంది. కూటమి ఐక్యత, ఆచరణాత్మక నిర్ణయాలే భవిష్యత్తులో దాని ప్రభావాన్ని నిర్ణయిస్తాయి.

తమిళనాడు పెట్టుబడుల వివరాలు ఏపీకి లీక్ చేశారా?

15 మంది అధికారులపై వేటు!

తమిళనాడు పెట్టుబడుల రహస్య డేటా ఏపీకి చేరినట్లు ఆరోపణలు

కీలక బాధ్యతల నుంచి అధికారులను తప్పించిన విజయ్ ప్రభుత్వం

ఆరోపణలను పూర్తిగా ఖండించిన ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా

ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా మండిపడ్డ డీఎంకే మాజీ మంత్రి



, నవంబర్ 19 (ప్రజావినికిడి):

తమిళనాడు ప్రభుత్వంలో పెట్టుబడుల డేటా లీక్ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులకు సంబంధించిన అత్యంత గోప్యమైన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చేరవేశారన్న ఆరోపణలతో సీఎం విజయ్ ప్రభుత్వం 15 మంది సీనియర్ అధికారులను విధుల నుంచి తొలగించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ 'గైడెన్స్ తమిళనాడు'లో పనిచేస్తున్న ఈ అధికారులపై అంతర్గత దర్యాప్తు అనంతరం వేటు వేసినట్లు సమాచారం.

తమిళనాడులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం జరిపిన చర్చలు, ఒప్పందాలు, రాయితీలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వర్గాలకు చేరవేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. తొలగించబడిన వారిలో ఎక్కువ మంది 20162021 మధ్య అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారు. పాలనాపరమైన కొనసాగింపు కోసం గత డీఎంకే ప్రభుత్వం కూడా వీరి సేవలను వినియోగించుకుంది. అయితే, తాజాగా తొలగించిన అధికారుల్లో ముగ్గురు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో చేరుతుండటం ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. తమిళనాడుకు రావాల్సిన కొన్ని భారీ ప్రాజెక్టులు ఏపీకి మళ్లడానికి ఈ లీకేజీలే కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఎలాంటి సమాచారం బయటకు వెళ్లిందనే దానిపై ప్రభుత్వం ఇప్పటివరకు అధికారిక ఆధారాలను బయటపెట్టలేదు.

ఈ పరిణామం తమిళనాడులో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. విజయ్ ప్రభుత్వ చర్యను డీఎంకే తీవ్రంగా తప్పుబట్టింది. డీఎంకే ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మాజీ మంత్రిగా పనిచేసిన టి.ఆర్.బి. రాజా స్పందిస్తూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత అపరిపక్వమైనదని విమర్శించారు. కేవలం సోషల్ మీడియా రాజకీయాల కోసమే, దశాబ్దాలుగా నిర్మించిన అత్యున్నత వ్యవస్థలను దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తమ ప్రభుత్వం అనుభవజ్ఞులైన అధికారులను కొనసాగించి పారిశ్రామిక ప్రగతిని సాధించిందని, ప్రస్తుత పాలకులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు.

మరోవైపు, ఈ ఆరోపణలను ఆంధ్రప్రదేశ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తోసిపుచ్చారు. పరిశ్రమల అనుకూల విధానాలు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారానే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులను ఆకర్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల రహస్య సమాచారాన్ని సేకరించో లేక కాపీ కొట్టో పెట్టుబడులు రాబట్టాల్సిన అవసరం ఏపీకి లేదన్నారు. రాష్ట్రాల మధ్య పారిశ్రామిక పోటీ ఎప్పుడూ ఆరోగ్యకరమైన విధానాల ఆధారంగానే సాగాలని ఆయన పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై అటు అధికార టీవీకే గానీ, ఇటు ముఖ్యమంత్రి విజయ్ కార్యాలయం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అత్యంత కీలకమైన పారిశ్రామిక రహస్యాల బదిలీకి సంబంధించిన ఆధారాలు ఎంతవరకు వాస్తవమనేది, ఈ పరిణామం రెండు రాష్ట్రాల సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

రూ.7.5 లక్షల కోట్ల పండగ..

పెళ్లిళ్ల సీజన్‌లో భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త జోష్!

, నవంబర్ 19(ప్రజావినికిడి):



భారతదేశంలో మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊపును తీసుకురానుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని అంచనా. వీటి ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు నమోదవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఈ ముహూర్తాల సీజన్.. రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా రంగాలకు అతిపెద్ద చోదక శక్తిగా మారనుందని వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది.

పెళ్లిళ్లు కేవలం శుభకార్యాలుగానే కాకుండా వ్యాపారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల కళాకారులు, సేవా రంగాలకు అండగా నిలిచే భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ స్పష్టం చేశారు. ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోనే దాదాపు 5 లక్షల వివాహాలు జరగనుండగా, అక్కడ ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల మేర వ్యాపారం సాగుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రూ.7.5 లక్షల కోట్ల ఖర్చులో సుమారు రూ.4 లక్షల కోట్లు (54 శాతం) వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల ద్వారా సమకూరనుండగా.. సర్వీసుల రంగం రూ.3.45 లక్షల కోట్ల వాటాను దక్కించుకోనుంది.

వినియోగ వ్యయంలో సింహభాగం ఆభరణాలు, దుస్తులదే కానుంది. బంగారం, వజ్రాభరణాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్లకు చేరనుండగా, వస్త్ర శ్రేణి రూ.90,000 కోట్ల వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది. గిఫ్ట్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, స్వీట్లు కూడా భారీగా అమ్ముడుపోనున్నాయి. సేవల విభాగంలో క్యాటరింగ్ రంగానికి రూ.75,000 కోట్లు, కల్యాణ మండపాలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లకు మరో రూ.60,000 కోట్ల వ్యాపారం సమకూరనుంది. గత కొన్నేళ్లుగా వివాహ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. 2022లో రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ ఈ ఏడాది రూ.7.50 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. అంతేకాకుండా, ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గణాంకాల్లో తగ్గిన పేదరికం..

ప్రజల జీవితాల్లో మార్పేదీ?

పేదరికంపై ప్రభుత్వ ప్రకటనలకే పరిమితం కాకుండా.. ప్రజల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర పరిశీలన అవసరం

, నవంబర్ 19(ప్రజావినికిడి):



దేశంలో పేదరికం తగ్గిందంటూ వెలువడుతున్న గణాంకాలు ఆర్థిక ప్రగతికి నిదర్శనంగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజల జీవన పరిస్థితులు ఎంతవరకు మెరుగుపడ్డాయన్నది కీలక ప్రశ్న. పేదరికం తగ్గిందని ప్రకటించడం ఒక అంశమైతే, ప్రజలు తమ అవసరాలను స్వయంగా తీర్చుకోగల స్థాయికి ఎదగడం మరో అంశం. గణాంకాల్లో కనిపించే పురోగతి ప్రజల రోజువారీ జీవితాల్లోనూ ప్రతిబింబించాలి. అప్పుడే ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం ఉంటుంది.ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం 2023-24 నాటికి భారత్‌లో తీవ్ర పేదరికం 2.6 శాతానికి తగ్గిందనే గణాంకాలను ప్రభుత్వం ఆర్థిక విజయంగా పేర్కొంటోంది. ఈ పురోగతిని పూర్తిగా కొట్టిపారేయాల్సిన అవసరం లేదు. పేదరికం తగ్గడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం దేశానికి సానుకూల పరిణామాలే. అయితే పేదరికాన్ని అంచనా వేసే విధానం, ఆదాయ స్థాయిలు, వినియోగ వ్యయాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గణాంకాలు ఒక నిర్దిష్ట ప్రమాణం ఆధారంగా రూపొందించబడతాయి. అవి ప్రజల వాస్తవ జీవన భారాన్ని పూర్తిగా ప్రతిబింబిస్తున్నాయా లేదా అన్నది పరిశీలించాలి.దేశంలో కోట్లాది కుటుంబాలు ఇప్పటికీ ఉచిత రేషన్ లేదా సబ్సిడీ ఆహార ధాన్యాలపై ఆధారపడుతున్నాయి. ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతే. పేద కుటుంబాలకు రేషన్ అందించడం ఆకలి నివారణలో కీలక పాత్ర పోషిస్తోంది. అయితే ఉచిత బియ్యం అందుతున్నంత మాత్రాన ఆ కుటుంబం ఆర్థికంగా బలపడిందని చెప్పలేం. ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ప్రయాణ అవసరాలు, ఇతర నిత్యావసరాల కోసం నగదు అవసరం ఉంటుంది. రేషన్‌తో ఆకలి కొంత తగ్గవచ్చు కానీ కుటుంబానికి ఆర్థిక స్వాతంత్ర్యం లభించదు. ప్రభుత్వ సహాయంతో జీవించడం, స్వతంత్రంగా ఆదాయం సంపాదించి గౌరవంగా జీవించడం మధ్య స్పష్టమైన తేడా ఉంది.మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కూరగాయలు, పప్పులు, నూనెలు, పాలు, మందులు, విద్యా ఖర్చులు పెరుగుతున్నప్పుడు ఆదాయం మాత్రం అదే స్థాయిలో పెరగకపోతే కుటుంబ బడ్జెట్ కుదేలవుతుంది. సంపన్న కుటుంబాలు ధరల పెరుగుదలను కొంతవరకు తట్టుకోగలిగినా, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు తమ అవసరాల్లో కోతలు విధించుకోవాల్సి వస్తుంది. ముఖ్యంగా పోషకాహారాన్ని తగ్గించడం, వైద్య చికిత్స వాయిదా వేయడం, పిల్లల విద్యకు సంబంధించిన ఖర్చులను తగ్గించడం వంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇవి పేదరికం తీవ్రతను తెలియజేసే వాస్తవ సూచనలు.ఉపాధి రంగంలోనూ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ఉద్యోగం ఉన్నంత మాత్రాన ఆర్థిక భద్రత ఉన్నట్లు కాదు. రోజువారీ కూలీలు, గిగ్ కార్మికులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధిపై ఆధారపడినవారు, అసంఘటిత రంగ కార్మికులకు స్థిరమైన ఆదాయం ఉండడం లేదు. కొన్నిరోజులు పని దొరికితే మరికొన్ని రోజులు ఉపాధి లేకుండా గడపాల్సి వస్తోంది. ఆదాయం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితుల్లో కుటుంబ అవసరాలను తీర్చడం కష్టంగా మారుతోంది. ఇలాంటి ఉపాధిని గణాంకాల్లో ఉద్యోగంగా చూపించినప్పటికీ, ఆ వ్యక్తికి లభిస్తున్న ఆదాయం, పని భద్రత, సామాజిక భద్రత ఎంత ఉందో కూడా పరిశీలించాలి. ఉపాధి కల్పించామని చెప్పడం కంటే జీవనానికి సరిపడా ఆదాయం వచ్చే ఉద్యోగాలను సృష్టించడం ముఖ్యం. ముఖ్యంగా యువత పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఉన్నత విద్య పూర్తి చేసినప్పటికీ సరైన ఉద్యోగాలు లభించక చాలామంది నిరీక్షిస్తున్నారు. ఉద్యోగాల కోసం పోటీ పెరుగుతున్నా, అందుకు తగిన అవకాశాలు కల్పించడంలో లోపాలు కనిపిస్తున్నాయి. చిన్నచిన్న పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న యువతను స్వయం ఉపాధి సాధించినవారిగా పరిగణించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు. వారి పనికి తగిన ఆదాయం, భద్రత, భవిష్యత్ అవకాశాలు కల్పించాలి. నిరుద్యోగ సమస్యను గణాంకాల పరిధిలో కాకుండా వాస్తవ పరిస్థితుల ఆధారంగా అంచనా వేసి, ఉపాధి కల్పనకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి.

గ్రూప్ రిజర్వేషన్లపై బెర్త్‌ల పరిమితి తొలగింపు..

రైల్వే కొత్త నిబంధనలు



, నవంబర్ 19 (ప్రజావినికిడి):

సమూహాలుగా ప్రయాణించే ప్రయాణికుల కోసం సౌత్ వెస్ట్రన్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. వివాహాలు, విద్యా విహారయాత్రలు, తీర్థయాత్రలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రయాణించే వారి సౌకర్యార్థం బల్క్ (గ్రూప్) టికెట్ బుకింగ్ నిబంధనలను సవరించింది. పాత నిబంధనల స్థానంలో కొత్త మార్గదర్శకాలను అమల్లోకి తెచ్చినట్లు ఎస్‌డబ్ల్యూఆర్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి వెల్లడించారు.

తాజా నిబంధనల ప్రకారం... గ్రూప్ టికెట్ల బుకింగ్‌పై ఉన్న గరిష్ఠ బెర్తుల పరిమితిని ఎస్‌డబ్ల్యూఆర్ పూర్తిగా ఎత్తివేసింది. అంతేకాకుండా, ఈ బుకింగ్‌లకు అనుమతి ఇచ్చే అధికారాన్ని డివిజనల్ కార్యాలయాల నుంచి స్థానిక స్టేషన్లకే అప్పగించారు. ప్రధాన రిజర్వేషన్ కేంద్రాల్లోని స్టేషన్ మేనేజర్లు, చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్లు ఇకపై ఎలాంటి ముందస్తు బెర్త్ పరిమితి లేకుండా గ్రూప్ బుకింగ్‌లను ఆమోదించవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

సాధారణ అడ్వాన్స్ రిజర్వేషన్ సమయం ప్రారంభమైన గంట తర్వాత, అంటే ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. అన్ని తరగతుల్లో కన్ఫర్మ్, ఆర్ఏసీ లేదా వెయిటింగ్ లిస్ట్ టికెట్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. అయితే, దరఖాస్తుదారులు నేరుగా రైల్వే అధికారులకే దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ట్రావెల్ ఏజెంట్ల ద్వారా వచ్చే దరఖాస్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని రైల్వే స్పష్టం చేసింది. కేవలం విదేశీ పర్యాటకులు, ఎన్నారైలకు మాత్రమే పాత నిబంధనల ప్రకారం మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు చేసుకునే సమయంలో ప్రయాణికులందరి పేర్లు, వయస్సు, లింగం, చిరునామాతో పాటు ప్రయాణ ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ సదుపాయం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి, దరఖాస్తులపై సీల్, సంతకం చేయాలని రైల్వే ఆదేశించింది. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా అదే కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, అయితే దానిని ప్రత్యేక లావాదేవీగా పరిగణిస్తారని అధికారులు తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

రాజకీయ జీవితానికి ఆత్మకథ అద్దం

- సోనియా గాంధీ అనుభవాలు.. కాంగ్రెస్ ప్రస్థానం, దేశ రాజకీయ పరిణామాలపై ఆసక్తి



రాజకీయ నాయకుల జీవితాలు బయటకు కనిపించేంత సులభంగా ఉండవు. అధికార బాధ్యతలు, పార్టీ నిర్వహణ, ప్రజల ఆకాంక్షలు, ప్రత్యర్థుల విమర్శలు, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే విషాదాలు.. ఇలా ఎన్నో అంశాలు ఒక నాయకుడి ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి. రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన నాయకుల ఆత్మకథలు ఈ అనుభవాలను మరో కోణంలో ప్రజలకు పరిచయం చేస్తాయి. సోనియా గాంధీ ఆత్మకథపై ఆసక్తి కూడా ఆమె సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్ పార్టీ పరిణామాలు, దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న కీలక మార్పుల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంటోంది.సోనియా గాంధీ జీవితం రాజకీయాలకు ముందు, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అనేక మలుపులు తిరిగింది. ఇటలీలో జన్మించి భారతీయ కుటుంబంలోకి అడుగుపెట్టడం, రాజీవ్ గాంధీతో వివాహం, కుటుంబ జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హత్యలతో ఎదురైన విషాదం ఆమె జీవితంలో కీలక ఘట్టాలు. రాజకీయాలకు దూరంగా ఉండాలనే భావన నుంచి కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను స్వీకరించే స్థాయికి రావడం అనేది సాధారణ పరిణామం కాదు. వ్యక్తిగతంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే రాజకీయ రంగంలో తనదైన పాత్రను పోషించాల్సి వచ్చింది.కాంగ్రెస్ పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్టీ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. నాయకత్వ సంక్షోభం, ఎన్నికల్లో పరాజయాలు, పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం, రాజకీయ ప్రత్యర్థుల బలమైన ప్రచారం వంటి పరిస్థితులు పార్టీని బలహీనపరిచాయి. అలాంటి సమయంలో పార్టీని పునర్వ్యవస్థీకరించడం, నాయకులు, కార్యకర్తల్లో విశ్వాసం కల్పించడం, దేశవ్యాప్తంగా పార్టీ బలాన్ని పెంచేందుకు ప్రయత్నించడం సోనియా గాంధీ రాజకీయ ప్రస్థానంలో కీలకంగా నిలిచాయి. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన సందర్భాలు భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారు. ప్రధానమంత్రి పదవిని స్వీకరించే అవకాశం ఉన్నప్పటికీ దాన్ని వదులుకుని మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేయడం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ నిర్ణయం వెనుక రాజకీయ వ్యూహం, వ్యక్తిగత ఆలోచన, పరిస్థితుల ప్రభావం వంటి అంశాలు ఉండవచ్చు. ఆ కాలంలో తీసుకున్న నిర్ణయాలు దేశ రాజకీయాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపాయి. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించడం, వివిధ పార్టీల మధ్య సమన్వయం సాధించడం, ప్రభుత్వ విధానాలకు రాజకీయ మద్దతు కల్పించడం వంటి అంశాల్లో ఆమె పాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది.సోనియా గాంధీ రాజకీయ జీవితంలో విమర్శలు కూడా తక్కువేమీ కాదు. విదేశీ జన్మ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ రాజకీయ ప్రత్యర్థులు అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారు. నాయకత్వ సామర్థ్యం, నిర్ణయాల వెనుక ఉద్దేశాలు, పార్టీ విధానాలు, కుటుంబ రాజకీయాలు వంటి అంశాలపై విమర్శలు ఎదురయ్యాయి. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కొనసాగుతూ రాజకీయంగా తన స్థానాన్ని నిలబెట్టుకోవడం ఆమె ప్రస్థానంలోని మరో కోణం. రాజకీయాల్లో విమర్శలను ఎదుర్కొంటూ ముందుకు సాగడం నాయకులకు తప్పనిసరి పరీక్ష. ఆ పరీక్షలో నాయకులు తీసుకునే నిర్ణయాలు వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి.ఆత్మకథలు కేవలం వ్యక్తిగత జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు. అవి ఒక కాలానికి సంబంధించిన రాజకీయ, సామాజిక పరిణామాలను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడే పత్రాలుగా కూడా నిలుస్తాయి. ఒక నాయకుడు ఎదుర్కొన్న సంక్షోభాలు, తీసుకున్న నిర్ణయాలు, ఇతర నాయకులతో ఉన్న సంబంధాలు, పార్టీ అంతర్గత పరిణామాలు వంటి అంశాలు ఆత్మకథలో చోటుచేసుకుంటే రాజకీయ చరిత్రకు కొత్త కోణాలు అందుబాటులోకి వస్తాయి. అయితే నాయకులు తమ జీవితాన్ని తాము చూసిన కోణంలోనే వివరించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆత్మకథలోని విషయాలను ఇతర చారిత్రక ఆధారాలతో పోల్చి పరిశీలించడం అవసరం.భారత రాజకీయాల్లో కుటుంబ వారసత్వం, నాయకత్వ మార్పులు, పార్టీ సిద్ధాంతాలు, ప్రజాభిప్రాయాల ప్రభావం వంటి అంశాలు ఎప్పటికప్పుడు చర్చకు వస్తుంటాయి. సోనియా గాంధీ ప్రస్థానం ఈ అంశాలన్నింటితో ముడిపడి ఉంది. నెహ్రూ కుటుంబ రాజకీయ వారసత్వం కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు బలంగా నిలిచినప్పటికీ, మరోవైపు కుటుంబ రాజకీయాలపై విమర్శలకు కూడా కారణమైంది. ఈ రెండు కోణాలను సమగ్రంగా పరిశీలించినప్పుడే ఆమె నాయకత్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. పార్టీకి వచ్చిన విజయాలు, ఎదురైన పరాజయాలు, రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు అన్నింటినీ సమానంగా విశ్లేషించాలి.ప్రజాస్వామ్యంలో నాయకుల జీవితాలను తెలుసుకోవడం ప్రజలకు అవసరం. అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పోరాటాలు, రాజకీయ సంక్షోభాల సమయంలో చూపిన వైఖరి ప్రజలకు నాయకుల పనితీరును అంచనా వేసే అవకాశం కల్పిస్తాయి. ఆత్మకథలు నాయకుల వ్యక్తిగత అభిప్రాయాలను మాత్రమే కాకుండా, అప్పటి రాజకీయ వాతావరణాన్ని కూడా ప్రతిబింబిస్తాయి. అయితే వాటిని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాల ఆధారంగా విశ్లేషించుకోవడం పాఠకుల బాధ్యత.నేటి రాజకీయాల్లో విమర్శలు, ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు ఎక్కువవుతున్న నేపథ్యంలో నాయకుల జీవిత అనుభవాలు, రాజకీయ నిర్ణయాలు, ప్రజాస్వామ్య విలువలపై వారి ఆలోచనలు తెలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది. రాజకీయాల్లోకి రావడం, నాయకత్వ బాధ్యతలు చేపట్టడం, ప్రజల విశ్వాసాన్ని పొందడం, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం అంత సులభమైన విషయం కాదు. ఒక నాయకుడి జీవితం ఎన్నో పాఠాలను నేర్పుతుంది. విజయాల వెనుక కృషి, పరాజయాల వెనుక కారణాలు, సంక్షోభాల సమయంలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్ రాజకీయ నాయకులకు మార్గదర్శకంగా నిలవవచ్చు.సోనియా గాంధీ ఆత్మకథ రాజకీయ చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఆమె జీవితాన్ని, నాయకత్వాన్ని, కాంగ్రెస్ పార్టీ ప్రస్థానాన్ని మరోసారి పరిశీలించే అవకాశాన్ని కల్పించవచ్చు. వ్యక్తిగత అనుభవాలు, రాజకీయ పరిణామాలు, చారిత్రక ఘట్టాలు ఒకచోట కలిసినప్పుడు గత రాజకీయాలపై కొత్త చర్చలకు దారితీస్తాయి. ఆత్మకథలను వ్యక్తిగత ప్రచారంగా కాకుండా చరిత్రను అర్థం చేసుకునే సాధనంగా చూడాలి. నాయకుల అనుభవాల నుంచి ప్రజాస్వామ్యానికి ఉపయోగపడే పాఠాలను గ్రహించడం, గత పరిణామాలను విమర్శనాత్మకంగా విశ్లేషించడం, భవిష్యత్ రాజకీయాలకు అవసరమైన విలువలను గుర్తించడం ముఖ్యం. అదే రాజకీయ

కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని రాజయ్య తన ఖాతాలో వేసుకోవడం సరికాదు

కేసీఆర్ హయాంలో అభివృద్ధి చేశాననడం అవాస్తవం.. చరిత్రను వక్రీకరించొదు

ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి: కాంగ్రెస్ నాయకుడు కొలిపాక సతీష్

స్టేషన్ ఘన్‌పూర్/ నవంబర్ 19(ప్రజావినికిడి):
స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ ఎమ్మెల్యే రాజయ్య తన ఖాతాలో వేసుకోవడం సరికాదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్ అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తానే చేపట్టినట్లు రాజయ్య చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.



బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్లు, పాలిటెక్నిక్ కళాశాల, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని రాజయ్య చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమేనన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే స్టేషన్ ఘన్‌పూర్‌లో రిజర్వాయర్ నిర్మాణం, ఫ్లైఓవర్ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కళాశాల పనులు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఘన్‌పూర్‌ను ఇందిరమ్మ గ్రామంగా ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. అప్పటికి కేసీఆర్ ముఖ్యమంత్రి కాలేదని, రాజయ్య ఎమ్మెల్యేగా కూడా లేరని, అలాంటప్పుడు ఆ అభివృద్ధి పనులను తన హయాంలో జరిగినట్లు ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా, రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గాంధీ చౌరస్తా నుంచి రైల్వే గేటు వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి జాప్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు నిర్వహించి, అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును రెండుసార్లు అడ్డుకున్న తర్వాతే పనులు ముందుకు కదిలాయని చెప్పారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కాంగ్రెస్ నాయకులుగా అప్పటి ఆర్‌అండ్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఈ సత్యనారాయణను కలిసి విజ్ఞప్తి చేశామని, ఆయన ఆదేశాలతో అప్పటి ఈఈ నాగేందర్, డీఈ జీవన్‌కుమార్ పరిశీలించి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు.
జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం విషయంలోనూ అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆందోళనలు నిర్వహించారని, కనీసం పిల్లర్లపై బ్రిడ్జి నిర్మించాలని కోరినా అప్పటి పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో నియోజకవర్గాన్ని తానే అభివృద్ధి చేశానని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.
ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ఇష్టానుసారంగా విమర్శలు చేయడం తగదన్నారు. 75 ఏళ్ల వయస్సులోనూ కడియం శ్రీహరి రాత్రింబవళ్లు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో 100 పడకల ఆసుపత్రి, మున్సిపాలిటీ ఏర్పాటు, సమీకృత విద్యా, వైద్య సదుపాయాల కల్పనతో పాటు రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభినందించాల్సింది పోయి నిరాధార విమర్శలు చేయడం సరికాదన్నారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలు, అవాస్తవ ఆరోపణలు మానుకోవాలని రాజయ్యకు హితవు పలికారు.
ఈ సమావేశంలో మామిడ్ల శ్రీనివాస్, సురేందర్, గట్టు కోటేశ్వర్, అజీముద్దీన్, నక్క పాపయ్య, ఏలీయా, రమేష్, శివ, కుమార్, శ్రీనివాస్, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా మానసిక దివ్యాంగులకు అన్నదానం

పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంతో జరుపుకున్న కుటుంబ సభ్యులు



మధిర/నవంబర్ 19 (ప్రజావినికిడి)::మధిర పట్టణ పరిధిలోని మాటూరుపేట గ్రామానికి చెందిన కొర్లగంటి సురేష్, వెన్నెల దంపతుల కుమారుడు కొర్లగంటి గన్విత్ పుట్టినరోజు సందర్భంగా గురువారం మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యుల మధ్యే కాకుండా మానసిక దివ్యాంగులైన చిన్నారులతో కలిసి జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న వితరణ చేసి తమ ఆనందాన్ని వారితో పంచుకున్నారు.ఈ సందర్భంగా గన్విత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, చక్కగా చదువుకొని మంచి జ్ఞానంతో ఉన్నత స్థాయికి ఎదగాలని మానసిక దివ్యాంగుల చిన్నారుల తరఫున భగవంతుడిని ప్రార్థించారు.చిన్నారులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకొని అన్నదానం చేసిన కొర్లగంటి కుటుంబ సభ్యులకు మదర్ థెరిస్సా సేవాసదనం నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గన్విత్ నానమ్మ జయలక్ష్మి, పోతినేని అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



కేసముద్రం/నవంబర్ 19(ప్రజావినికిడి)::భారత తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రామ నాగేశ్వర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానిగా దేశానికి విశేష సేవలందించిన ఇందిరా గాంధీ సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వల్లందాస్ ఉమా రవి, కనుకుల సుభద్ర రాంబాబు, బానోత్ విజయ బద్రు, మార్కెట్ డైరెక్టర్లు అయూబ్ ఖాన్, యాదగిరి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

31 మందికి చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన సర్పంచ్ రజిత




జనగామ/చేర్యాల, నవంబర్ 19(ప్రజావినికిడి):చేర్యాల మండలం ముత్యాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం కింద మంజూరైన పింఛన్ పత్రాలను గురువారం గ్రామ సర్పంచ్ రజిత వరిష్ లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతువుల కేటగిరీలకు చెందిన మొత్తం 31 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ పింఛన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి బోజు నరేష్, వార్డు సభ్యులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పెన్షన్ల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు

కేసముద్రం/నవంబర్ 19(ప్రజావినికిడి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కేసముద్రం మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన లబ్ధిదారునికి ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్ మంజూరు పత్రాన్ని బుధవారం ఆమె అందజేశారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తోందని తెలిపారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి ఆర్థిక భద్రతకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పింఛన్ మంజూరుతో లబ్ధిదారునికి ఆర్థికంగా చేయూత లభిస్తుందని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రికార్డుల వేటలో జస్ప్రీత్ బుమ్రా



- జవగళ్ శ్రీనాథ్ రికార్డు బద్దలు.. భారత టెస్టు క్రికెట్‌లో టాప్-10లోకి ప్రవేశం

భారత క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మరో అరుదైన ఘనతను సాధించాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో అద్భుత బౌలింగ్‌తో భారత క్రికెట్ చరిత్రలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మాజీ భారత ఫాస్ట్ బౌలర్ జవగళ్ శ్రీనాథ్ పేరిట ఉన్న టెస్టు వికెట్ల రికార్డును అధిగమించి భారత తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో టాప్-10లోకి చేరాడు.ఈ మ్యాచ్‌లో బుమ్రా తన పదునైన బౌలింగ్‌తో న్యూజిలాండ్ బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్‌ను పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు పంపించాడు. అనంతరం డారిల్ మిచెల్, టామ్ బ్లండెల్‌లను ఔట్ చేసి కీలక వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో అతడి టెస్టు వికెట్ల సంఖ్య 237కు చేరింది. ఇప్పటివరకు 67 టెస్టుల్లో 236 వికెట్లు తీసిన జవగళ్ శ్రీనాథ్‌ను బుమ్రా అధిగమించాడు. ఈ ఘనతను కేవలం 53 టెస్టుల్లోనే సాధించడం విశేషం. **చంద్రశేఖర్ రికార్డుపై కన్ను**బుమ్రా తదుపరి లక్ష్యం భారత మాజీ స్పిన్నర్ భగవత్ చంద్రశేఖర్ రికార్డును అధిగమించడమే. చంద్రశేఖర్ తన టెస్టు కెరీర్‌లో 242 వికెట్లు పడగొట్టి భారత బౌలర్ల జాబితాలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం 237 వికెట్లతో ఉన్న బుమ్రా మరో ఆరు వికెట్లు సాధిస్తే ఈ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. తన ప్రస్తుత బౌలింగ్ ప్రదర్శన కొనసాగిస్తే రాబోయే మ్యాచ్‌ల్లో మరిన్ని మైలురాళ్లను చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.**భారత టెస్టు బౌలర్లలో కుంబ్లే అగ్రస్థానం** భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే 619 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. రవిచంద్రన్ అశ్విన్ 537 వికెట్లతో రెండో స్థానంలో, కపిల్ దేవ్ 434 వికెట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. హర్భజన్ సింగ్ 417, రవీంద్ర జడేజా 356, జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ 311 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.**నిలకడే బుమ్రా బలం**వేగం, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్, వైవిధ్యమైన బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం బుమ్రా ప్రత్యేకత. ముఖ్యంగా కీలక సమయాల్లో వికెట్లు సాధిస్తూ జట్టుకు విజయాలను అందించడంలో ముందుంటాడు. గాయాలు, విరామాలు ఎదురైనా తిరిగి పుంజుకుని అత్యుత్తమ ప్రదర్శన చేయడం అతడి పట్టుదలకు నిదర్శనం. భారత టెస్టు జట్టులో కీలక బౌలర్‌గా ఎదిగిన బుమ్రా, తక్కువ మ్యాచ్‌ల్లోనే సాధించిన ఈ ఘనతతో తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపిం చాడు. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించి భారత క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

బాటిల్ మూతలతో బాల్ ట్యాంపరింగ్ చేశాం!

షోయబ్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు.. 2018 శాండ్‌పేపర్ వివాదంపై మరోసారి చర్చ



క్రికెట్ ప్రపంచంలో మరోసారి బాల్ ట్యాంపరింగ్ వివాదం తెరపైకి వచ్చింది. పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ చేసిన సంచలన వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఇంగ్లండ్ పర్యటన సందర్భంగా పాకిస్థాన్ ఆటగాళ్లు బంతి స్వరూపాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్‌కు బదులుగా బాటిల్ మూతలను ఉపయోగించేవారని ఆయన వెల్లడించాడు. బంతిని ట్యాంపరింగ్ చేయడం కొత్త విషయమేమీ కాదని, దీనిపై ఇప్పుడు ఇంత పెద్ద చర్చ అవసరం లేదని అభిప్రాయపడ్డాడు.**ఉస్మాన్ ఖవాజా వ్యాఖ్యలతో మళ్లీ వివాదం**2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన ఘటన ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. కేప్‌టౌన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని గీస్తున్న దృశ్యాలు కెమెరాకు చిక్కాయి. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ జరిపి అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, బాన్‌క్రాఫ్ట్‌లపై నిషేధం విధించింది.తాజాగా ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబ్'లో చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరోసారి చర్చలోకి వచ్చింది. బాల్ ట్యాంపరింగ్ వ్యవహారం గురించి జట్టులోని అందరికీ తెలుసని, కేవలం ముగ్గురు ఆటగాళ్లనే బాధ్యులుగా చేశారని ఆయన పేర్కొన్నాడు. దీంతో మాజీ క్రికెటర్ల మధ్య మరోసారి వాదోపవాదాలు మొదలయ్యాయి. **మా వాళ్లు కూడా చేసేవారు**ఈ వివాదంపై స్పందించిన షోయబ్ అక్తర్ గతంలో పాకిస్థాన్ జట్టు కూడా బంతి స్వరూపాన్ని మార్చేందుకు వివిధ పద్ధతులు ఉపయోగించేదని అంగీకరించాడు. ఇంగ్లండ్‌లో ఆడే సమయంలో బాటిల్ మూతలను ఉపయోగించేవారని వెల్లడించాడు. బంతిని మార్చడం, రివర్స్ స్వింగ్ సాధించేందుకు వివిధ ప్రయత్నాలు చేసేవారని తెలిపాడు. అయితే ఈ విషయాలను ఇప్పుడు పెద్ద వివాదంగా మార్చడం సరికాదని అభిప్రాయపడ్డాడు.**జట్టులో అందరికీ తెలిసే ఉంటుంది**బాల్ ట్యాంపరింగ్ అనేది ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్లు మాత్రమే తీసుకునే నిర్ణయం కాదని అక్తర్ పేర్కొన్నాడు. ఇలాంటి వ్యవహారాలు జట్టు స్థాయిలోనే జరిగే అవకాశం ఉంటుందని, బంతి రివర్స్ స్వింగ్ కాకపోతే మ్యాచ్‌లు గెలవడం కష్టమయ్యేదని వ్యాఖ్యానించాడు. ఉస్మాన్ ఖవాజా వెల్లడించిన విషయాల్లోనూ వాస్తవం ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. అయితే గతంలో తన సహచర ఆటగాళ్ల గురించి చెప్పడానికి తన వద్ద కూడా చాలా విషయాలు ఉన్నాయని, వారిని బహిరంగంగా తప్పుబట్టడం ఇష్టం లేదని స్పష్టం చేశాడు. **క్రికెట్ ప్రతిష్ఠకు దెబ్బ** బాల్ ట్యాంపరింగ్ వంటి వివాదాలు క్రికెట్‌లో ఆటగాళ్ల నైతికత, క్రీడాస్ఫూర్తిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఆటలో గెలుపు కోసం నిబంధనలను ఉల్లంఘించడం క్రీడా విలువలకు విరుద్ధం. ఎంతటి ప్రతిభావంతులైన ఆటగాళ్లయినా నిబంధనలకు లోబడే ఆడాలి. మాజీ ఆటగాళ్లు చేస్తున్న తాజా వ్యాఖ్యలతో గతంలో జరిగిన ఘటనలపై మరిన్ని చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలు క్రికెట్‌లో పారదర్శకత, క్రమశిక్షణ, నిబంధనల అమలు ఎంత ముఖ్యమో మరోసారి గుర్తుచేస్తున్నాయి.

సిరాజ్‌ను తప్పించడం తప్పుకాదు!

- జట్టు ఎంపికను సమర్థించిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్.. ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకున్నామంటూ వివరణ



న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విమర్శలపై భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందించాడు. సిరాజ్‌ను పక్కనపెట్టడం తప్పు నిర్ణయం కాదని స్పష్టం చేశాడు. జట్టు ఎంపిక సమయంలో ప్రత్యర్థి బలాబలాలు, పిచ్ పరిస్థితులు, ఐదు రోజుల ఆటను పరిగణనలోకి తీసుకున్నామని వెల్లడించాడు.**వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఎందుకంటే?**న్యూజిలాండ్ జట్టులో నలుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉండటంతోనే వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం కల్పించినట్లు కోటక్ వివరించాడు. భారత జట్టులో ఇద్దరు స్పిన్ బౌలర్లు, మరో ఇద్దరు సీమ్ బౌలర్లు ఉన్నారని తెలిపాడు. సిరాజ్ విషయంలో ఎలాంటి సమస్య లేదని, అందుబాటులో ఉన్న ఆటగాళ్లలో అత్యుత్తమ జట్టును ఎంపిక చేశామని పేర్కొన్నాడు.**ప్రసిద్ధ్ కృష్ణకు కోచ్ మద్దతు**భారత బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా కోటక్ ఖండించాడు. ప్రసిద్ధ్ దూకుడుగా బౌలింగ్ చేసే ఆటగాడని, వికెట్ల కోసం ప్రయత్నించే క్రమంలో కొన్నిసార్లు పరుగులు సమర్పించుకోవాల్సి వస్తుందని చెప్పాడు. వికెట్లు తీసినప్పుడు ప్రశంసిస్తూ, పరుగులు ఇచ్చినప్పుడు విమర్శించడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డాడు.**భారత్‌కు చేజారిన అవకాశం**తొలి రోజు ఆటలో భారత బౌలర్లు ప్రారంభంలో మంచి ప్రదర్శన చేశారు. జస్ప్రీత్ బుమ్రా కీలక వికెట్లు పడగొట్టడంతో న్యూజిలాండ్ ఒక దశలో 70 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అయితే హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుత భాగస్వామ్యంతో భారత బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ ఐదు వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. నికోల్స్ 113, ఫిలిప్స్ 94 పరుగులతో అజేయంగా నిలిచారు.**కీలక క్యాచ్ చేజారడమే కారణం** నికోల్స్‌ను ఔట్ చేసే అవకాశాన్ని భారత జట్టు చేజార్చుకోవడం మ్యాచ్‌పై ప్రభావం చూపిందని కోటక్ పేర్కొన్నాడు. కొత్త బంతితో పిచ్ బౌలర్లకు అనుకూలంగా ఉందని, ఎండ కారణంగా పిచ్‌లోని తేమ త్వరగా తగ్గిపోయిందని వివరించాడు. కీలక సమయంలో క్యాచ్ పట్టి ఉంటే భారత్ మరింత ఆధిపత్యం సాధించేదని అభిప్రాయపడ్డాడు.

న్యూజిలాండ్‌కు నికోల్స్ శతకం

- భారత్‌తో తొలి టెస్టు తొలి రోజు 243/5..
- ఫిలిప్స్‌తో అజేయ భాగస్వామ్యం



వెల్లింగ్టన్: భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ బ్యాటర్ హెన్రీ నికోల్స్ శతకంతో రాణించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 82 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. నికోల్స్ 113 పరుగులతో అజేయంగా నిలవగా, గ్లెన్ ఫిలిప్స్ 94 పరుగులతో క్రీజులో ఉన్నాడు.ఒక దశలో 70 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్‌ను నికోల్స్, ఫిలిప్స్ ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా మూడు వికెట్లు పడగొట్టాడు.

హాసిని రెడ్డికి డబుల్ గోల్డ్

- జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారిణి అద్భుత ప్రతిభ.. సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకాలు



తెలంగాణకు చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కె. సాయి రత్న హాసిని రెడ్డి జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు సాధించింది. తిరువనంతపురంలో నిర్వహించిన 11వ జాతీయ చెవిటి సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-16 బాలికల సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ విజేతగా నిలిచి డబుల్ గోల్డ్ కైవసం చేసుకుంది. **సింగిల్స్‌లో ఘన విజయం**సింగిల్స్ ఫైనల్లో కర్ణాటకకు చెందిన రుచిత గౌడపై హాసిని రెడ్డి 15-7, 15-4 స్కోరుతో వరుస గేముల్లో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని అందుకుంది.**మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ సత్తా** మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకే చెందిన అర్మాన్‌తో కలిసి ఆడిన హాసిని.. గుజరాత్‌కు చెందిన రాహుల్, శ్రావ్య జోడీపై 15-7, 15-6 స్కోరుతో విజయం సాధించింది. దీంతో రెండో స్వర్ణ పతకాన్ని కూడా తన ఖాతాలో వేసుకుంది.మణికొండలోని ఇండియన్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న హాసిని రెడ్డి సాధించిన ఈ ఘనత తెలంగాణ క్రీడారంగానికి గర్వకారణంగా నిలిచింది.

లక్ష్యసేన్‌కు మరోసారి వరల్డ్ టూర్ ఫైనల్స్ అవకాశం

- రెండోసారి ప్రతిష్ఠాత్మక టోర్నీకి అర్హత.. హాంకాంగ్ ఓపెన్ ఫలితాలతో ఖరారైన బెర్త్.. 2021లో సెమీఫైనల్ వరకు చేరిన భారత షట్లర్



హాంకాంగ్: భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్యసేన్ మరోసారి ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. హాంకాంగ్ ఓపెన్‌లో చోటుచేసుకున్న ఫలితాలు అతడికి కలిసివచ్చాయి. జపాన్ ఆటగాడు కోకి వటనాబేపై భారత షట్లర్ కిదాంబి శ్రీకాంత్ విజయం సాధించడంతో లక్ష్యసేన్‌కు టోర్నీలో పాల్గొనే అవకాశం ఖరారైంది. దీంతో రెండోసారి వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.హాంకాంగ్ ఓపెన్‌లో శ్రీకాంత్ అద్భుతంగా ఆడి వటనాబేపై 21-16, 16-21, 21-9 తేడాతో విజయం సాధించాడు. ఈ ఫలితం వరల్డ్ టూర్ ఫైనల్స్ అర్హత పోటీలో లక్ష్యసేన్‌కు కీలకంగా మారింది. సీజన్‌లో సాధించిన విజయాలు, ర్యాంకింగ్స్‌లో నిలకడైన ప్రదర్శన అతడికి ఈ అవకాశాన్ని అందించాయి.ఇటీవల లక్ష్యసేన్ హైలో ఓపెన్, కుమామోటో మాస్టర్స్ టైటిళ్లను వరుసగా గెలుచుకుని మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఈ విజయాలతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరుకున్నాడు. ఏడాది పొడవునా పలు అంతర్జాతీయ టోర్నీల్లో నిలకడగా రాణించడం అతడి అర్హతకు దోహదపడింది.2021లో తొలిసారి వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన లక్ష్యసేన్ అప్పట్లో సెమీఫైనల్ వరకు చేరి సత్తా చాటాడు. ఇప్పుడు రెండోసారి ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో పాల్గొనే అవకాశం దక్కించుకోవడంతో మరోసారి తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. డిసెంబర్ 9 నుంచి 13 వరకు చైనాలోని హాంగ్‌జౌలో వరల్డ్ టూర్ ఫైనల్స్ జరగనున్నాయి. ఈ టోర్నీలో ప్రపంచ అత్యుత్తమ షట్లర్లతో తలపడనున్న లక్ష్యసేన్‌పై భారత బ్యాడ్మింటన్ అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.



కృతి, కీర్తిలతో కలిసి రజినీకాంత్‌గా మారిన అనిల్ రావిపూడి..!


ప్రమోషన్స్ అంతే చాలు అనిల్ రావిపూడి ముందుంటారు. సంక్రాంతి సినిమాల సందడి మొదలవ్వడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ దర్శకుడు అనిల్ రావిపూడి మాత్రం అప్పుడే ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టేశారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా ఆయన తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే సినిమా విడుదలకు ముందే అనిల్ రావిపూడి తనదైన స్టైల్‌లో ప్రమోషన్స్‌తో సందడి చేస్తున్నారు. ూశ్రీంశీ =ఘఎ - ట్రెండీ టాక్: జాతీయ ఉత్తమ నటి ప్రయోగాలు ఈ సినిమా ప్రమోషన్స్‌లో



భాగంగా అనిల్ రావిపూడి చేసిన ఓ పని ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన క్లాసిక్ మూవీ దళపతిలోని ఓ పాపులర్ సీన్‌ను ఆయన రీక్రియేట్ చేశారు. ఇందులో హీరోయిన్ కృతి శెట్టి కూడా పాల్గొన్నారు. ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇవ్వడానికి ఈ సరదా వీడియోను రూపొందించారు. ఈ వీడియోలో అనిల్ రావిపూడి, కృతి శెట్టి చేసిన సందడి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అయితే ఈ ప్రమోషనల్ వీడియోలో మరో ఆసక్తికరమైన విషయం కూడా ఉంది. సినిమా హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి ఇద్దరూ కలిసి కనిపిస్తూ సరదాగా మాట్లాడుకున్నారు. ప్రమోషన్స్ అంటే అనిల్ రావిపూడి ప్రతిచోటా వచ్చేస్తున్నారనే అర్థం వచ్చేలా ఫన్నీగా కామెంట్స్ చేశారు. అంతేకాదు, ఇది తమ గర్ల్స్ సాంగ్ అంటూ చిన్న స్టెప్‌తో సందడి చేశారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. అనిల్ రావిపూడి సినిమా ప్రమోషన్స్‌లో కూడా కామెడీని వదలడం లేదని కామెంట్స్ చేస్తున్నారు. సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పుడే ఈ స్థాయిలో సందడి చేస్తుంటే, రిలీజ్ సమయానికి ఇంకెన్ని కార్యక్రమాలు ప్లాన్ చేస్తారో అని ఆసక్తి చూపిస్తున్నారు. నవంబర్ 20 నుంచి ఈ సినిమా పాటల ప్రమోషన్స్ ప్రారంభం కానున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మరోవైపు డిసెంబర్ 26, 27 తేదీల్లో చికాగోలో, డిసెంబర్ 29 నుంచి 31 వరకు ఆస్టిన్, డల్లాస్ నగరాల్లో చిత్ర బృందం అమెరికా ప్రమోషనల్ టూర్ నిర్వహించనుంది.

పురుషుల దినోత్సవం సందర్భంగా రామ్ లోన్ వోల్ఫ్

(నవంబరు 19) అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని పురుషులందరికీ సెల్యూట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఒ్ఘూశీ23 చిత్రం నుంచి ఒక అదిరిపోయే ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశాడు. ఈ సినిమాలో తాను పోషిస్తున్న 'లోన్ వోల్ఫ్' పాత్ర వెనుక భాగాన్ని ఆవిష్కరిస్తూ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ సినీ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటోంది.తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకున్న రామ్.. "లోన్ వోల్ఫ్: తన సొంత మార్గాన్ని ఎంచుకుని, ప్రపంచాన్ని ఒంటరిగానే ఢీకొట్టే అత్యంత స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తి" అంటూ ఆ పాత్ర తాలూకు స్వభావాన్ని నిర్వచించాడు. అంతర్గత బలం, మొక్కవోని దృఢ సంకల్పం కలిగిన ఒక బలమైన వ్యక్తిత్వంతో ఈ నియో-నాయర్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాతో రామ్ తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టాడు. నటుడిగానే కాకుండా మొదటిసారిగా రచయితగా, దర్శకుడిగా మెగాఫోన్ పట్టి సరికొత్త బాధ్యతను తన భుజాన వేసుకున్నాడు.ఈ చిత్రంలో రామ్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్, సంయుక్తా మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక సాంకేతిక బృందం విషయానికి వస్తే.. ప్రతిభావంతుడైన ఎస్.తిరునావుక్కరసు డీవోపీగా పనిచేస్తుండగా, సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ సంగీతం సమకూరుస్తున్నాడు. 'రాపో' సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినూత్నమైన కథాంశం, అద్భుతమైన నటీనటుల కలయికతో తెలుగు ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పంచేందుకు రామ్ సిద్ధమవుతున్నాడు.




ఆ వార్తల్లో నిజం లేదు

తమిళ స్టార్ సూర్య సినిమాలో గోపీచంద్ విలన్ అంటూ ప్రచారం ఖండించిన గోపీచంద్ టీం



టాలీవుడ్ హీరో గోపీచంద్ ఒక తమిళ సినిమాలో ప్రతినాయకుడి పాత్ర (విలన్) పోషించనున్నాడంటూ వస్తున్న వార్తలను ఆయన బృందం ఖండించింది. ఇవి పూర్తిగా అవాస్తవాలని స్పష్టం చేస్తూ బుధవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళ స్టార్ హీరో సూర్య తదుపరి చిత్రంలో గోపీచంద్ విలన్‌గా నటించబోతున్నాడని, ఈ పాత్ర కోసం భారీ పారితోషికం కూడా ఆఫర్ చేశారని కొన్ని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గోపీచంద్ టీం స్పందిస్తూ "మా హీరో గోపీచంద్ ఓ తమిళ చిత్రంలో విలన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. మీడియా, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఇలాంటి తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని కోరుతున్నాము" అని ఆ ప్రకటనలో పేర్కొంది. గోపీచంద్ ప్రాజెక్టులకు సంబంధించిన ఏ అధికారిక సమాచారాన్నైనా తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారానే తెలియజేస్తామని తెలిపింది.గోపీచంద్ తన కెరీర్ ఆరంభంలో 'జయం', 'నిజం', 'వర్షం' వంటి విజయవంతమైన చిత్రాల్లో ప్రతినాయకుడిగా నటించి గొప్ప పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత హీరోగా స్థిరపడి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ప్రస్తుతం ఆయన సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో 'భారత వర్ష: సాగా ఆఫ్ శులా' అనే చారిత్రక యాక్షన్ చిత్రంతో పాటు, 'సింగ' అనే మరో యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తూ బిజీగా ఉన్నాడు.

కష్టాలు తట్టుకుని నిలబడిన నిజమైన హీరో కాంతారావు: తమ్మారెడ్డి



తెలుగు తెరపై జానపద కథానాయకుడిగా కాంతారావు ఒక వెలుగు వెలిగారు. ఎన్టీఆర్ .. ఏఎన్నార్ తరువాత స్థానంలో తన ప్రత్యేకతను చాటుకున్న కాంతారావు, సాంఘిక .. పౌరాణిక చిత్రాలలోను ప్రేక్షకులను మెప్పించారు. నిర్మాతగా నష్టపోయిన ఆయన, తన చివరి రోజులలో ఆర్థికపరమైన ఇబ్బందులను చూశారు. ఆ సమయంలో టీవీ సీరియల్స్ చేస్తూ, ముందుకు వెళ్లారు. అలాంటి కాంతారావును గురించి 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ్మారెడ్డి భరద్వాజ ప్రస్తావించారు.
కాంతారావుగారు కథానాయకుడిగా ఒక ప్రత్యేకమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఎన్టీఆర్ .. ఏఎన్నార్ తరువాత తన పేరు చెప్పుకునే స్థాయికి ఆయన ఎదిగారు. ఎన్టీఆర్ - ఏఎన్నార్ ఇద్దరితోను సఖ్యతగా ఉంటూ, వాళ్లిద్దరి సినిమాలలోనూ నటించారు. ఎన్నో భారీ విజయాలను అందుకున్నారు. నిర్మాతగా కొన్ని సినిమాలు ఆయనకి నష్టాలు తెచ్చిపెట్టాయి. అందువలన ఆయన చాలా ఇబ్బందులు పడ్డారు పాపం. ఒక స్థాయిలో డబ్బును .. హోదాను చూసిన కాంతారావు, ఆ తరువాత ఆర్థికపరమైన ఇబ్బందులను తట్టుకుని నిలబడటం అంత తేలికైన విషయం కాదు" అని అన్నారు."కాంతారావుగారు సినిమాలను నిర్మించడం వలన నష్టాలు చూడవలసి వచ్చింది. సాధారణంగా అలాంటి పరిస్థితులలో ఇండస్ట్రీలో గౌరవం తగ్గుతూ ఉంటుంది. అలాంటి సన్నివేశాలను ఫేస్ చేయడం ఒక స్థాయి వ్యక్తులకు అంత తేలికైన విషయం కాదు. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ .. తాను ముందుకు వెళుతూ .. కుటుంబాన్ని నెట్టుకురావడం నిజంగా చాలా గొప్ప విషయమేనని చెప్పాలి. తెరపైనే కాదు .. జీవితంలో చివరి నిమిషం వరకూ ఆయన పోరాడుతూనే వచ్చారు. అందువలన కాంతారావుగారు చాలా ధైర్యవంతుడు అనే అంటాను" అని తన మనసులోని మాటను చెప్పారు.

మెడిసిన్ ఇంటర్న్‌షిప్ కోసమే

తెలుగు సినిమాలకు దూరం కావడంపై క్లారిటీ ఇచ్చిన నటి శ్రీలీల



గత కొంతకాలంగా తెలుగు సినిమాల్లో పెద్దగా కనిపించకపోవడంపై వస్తున్న ప్రచారానికి నటి శ్రీలీల తెరదించింది. తాను టాలీవుడ్‌కు దూరం కాలేదని, తన చదువు వల్లే కొత్త సినిమాలు అంగీకరించలేకపోయానని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో జరిగిన 'ఓం' (ఓ.ఎం: ఆపరేషన్ మోల్) చిత్ర ప్రీరిలీజ్ వేడుకలో పాల్గొన్న ఆమె, ఈ మేరకు స్పష్టతనిచ్చింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం రెండేళ్ల పాటు మెడికల్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చిందని శ్రీలీల తెలిపింది. ఈ ఇంటర్న్‌షిప్ కోసం ముంబయిలోని డీవై పాటిల్ యూనివర్సిటీలో తాను ప్రత్యక్షంగా హాజరుకావడం తప్పనిసరి కావడంతో, కొత్త చిత్రాల షూటింగ్‌లకు సమయం కేటాయించలేకపోయానని వివరించింది. ఆ సమయంలోనే తాను 'ఓం' సినిమాకు మాత్రమే సంతకం చేశానని పేర్కొంది. మెడిసిన్ తప్ప తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉండటానికి మరే ఇతర కారణాలు లేవని తేల్చిచెప్పింది. ఇదే సమయంలో తన కెరీర్, సినిమాల ఎంపికపై కూడా శ్రీలీల మాట్లాడింది. "చాలా చిన్న వయసులో నటిగా ప్రయాణాన్ని మొదలుపెట్టాను. కెరీర్ తొలిరోజుల్లో సినిమాల ఎంపిక విషయంలో నాకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదు. వచ్చిన అవకాశాలను అంగీకరిస్తూ ముందుకు వెళ్లాను. కొన్ని సినిమాల తర్వాత తప్పులు ఎక్కడ జరుగుతున్నాయో అర్థమైంది. ఇప్పుడు సినిమాల ఎంపికలో పరిణతి వచ్చింది" అని వివరించింది. ధనుష్ కథానాయకుడిగా నటించిన 'ఓం' చిత్రం నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో శ్రీలీల చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. మెడికల్ బాధ్యతలు పూర్తి కావడంతో ఆమె త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులతో తెలుగు తెరపై సందడి చేయనుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613